
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి

జిల్లా వార్తలు

మంగళవారం 22 జూలై 2025

అగ్రికల్చర్ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి అనుమతి

- ఉత్తర్వులు జారీ చేసిన వ్యవసాయ వర్సిటీ

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), జూలై 21 (ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్ డిప్లొమో కోర్సులో ప్రవేశాలకు అనుమతిస్తూ ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ కారణాలతో తిరుపతి వ్యవసాయ కళాశాలలో నిర్వహిస్తున్న అగ్రికల్చర్ డిప్లొమో కోర్సులో ప్రవేశానికి అనుమతి నిరాకరించారు. అయితే పలువురి విజ్ఞప్తి మేరకు ప్రవేశాలకు అనుమతించారు. ఈనెల 25వ తేదీకి వెబ్ ఆప్షన్ల నమోదుకు చివరి గడువుగా విధించినట్లు ప్రిన్సిపాల్ సుమతి చెప్పారు.

మేఘమాల



పచ్చని గుట్టలు.. చల్లని గాలులు.. నీలాకాశం మీద తేలాడుతూ వచ్చిన తెల్లని మబ్బులు.. తిరుమల ఆలయం వెనుక వాలి సేదదీరుతూ భక్తులకు కనువిందు చేశాయి. అఖిలాండం వద్ద నుంచి చూస్తే శ్రీవారి ఆలయానికి ప్రకృతి వేసిన శ్వేతమేఘమాలలా కనిపించింది. పలువురు ఈ దృశ్య నేపథ్యంగా ఫొటోలు దిగారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి





నట కెరటం

ఆకలితీర్చుకోవడం కోసం రిక్షా తొక్కాడు. అంచెలంచెలుగా ఎదిగి విమానమూ ఎక్కాడు. ఇటుకలెత్తిన ఇంటికే అతిథిగా వెళ్లాడు. చింతామణి సుబ్బిశెట్టిగా గిలిగింతలు పెట్టాడు. ఉత్తర కుమార పాత్రలో చిచ్చరపిడుగు అనిపించుకున్నాడు. ఆయన నటనాచతురతకు మురిసిన 'బంగారు' నంది గుప్పెట్లో వాలింది. ఒక్కడే వంద నాటక సమాజాలను ఒక్క చోట కలుపుతాడు. ఒక్కడే హనుమ నాటకోత్సవ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తాడు. ఈ క్రమంలో ప్రశంసొచ్చినా, విమర్శొచ్చినా ఒక్కడికే. ఆయనే అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బి.నారాయణ రెడ్డి. అందరూ ఆయనను బి.ఎన్.రెడ్డి అనీ, బీఎన్ఆర్ అనీ ఆత్మీయంగా పిలుస్తారు. అభినయ ఆర్ట్స్ రజతోత్సవ వేడుకలు మహతి ఆడిటోరియంలో జరుగుతున్న వేళ బీఎన్.రెడ్డితో ఆంధ్రజ్యోతి సంభాషణ...

8

నేడు టీటీడీ బోర్డు సమావేశం

- 45 అంశాలతో అజెండా



తిరుమల, జూలై21(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం మంగళవారం జరగనుంది. తిరుమల అన్నమయ్య భవనంలో ఉదయం 10.30 గంటలకు చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన సభ్యులు సమావేశం కానున్నారు. దాదాపు 45 అంశాలతో రూపొందించిన అజెండాపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. ఇందులో ప్రధానంగా టీటీడీలోని కాంట్రాక్ట్ డ్రైవర్లను, విద్యాసంస్థల్లోని కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయడం, తిరుమలలోని పాత భవనాలను నూతన డోనార్ స్కీం కింద పునర్నిర్మించే అంశం, వేదపారాయణదారులకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు అందజేసే అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. అలాగే బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న క్రమంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై కూడా చర్చ జరగనుంది. శ్రీవాణి ట్రస్టు ద్వారా వివిధ ప్రాంతాల్లో నిర్మిస్తున్న ఆలయాల నిర్మాణానికి పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదల అంశంపై కూడా చర్చించి నిర్ణయాలు తీసుకోన్నారు. టీటీడీలో అన్యమత ఉద్యోగుల అంశం ఇటీవల తీవ్రస్థాయిలో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.టీటీడీలో దాదాపు వెయ్యి మంది అన్యమత ఉద్యోగులు ఉన్నారంటూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి సంజయ్ వ్యాఖ్యానించడం కలకలం సృష్టిస్తోంది. ఇప్పటికే టీటీడీ ఐదుగురు ఉద్యోగులను సస్పెండ్ చేయడంతో పాటు మరికొందరిపై విజిలెన్స్ విభాగంతో విచారణ చేయిస్తోంది. అయితే పూర్తిస్థాయిలో టీటీడీ నుంచి అన్యమత ఉద్యోగుల తొలగింపుపై మరోమారు చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. అలాగే టీటీడీలో పనిచేస్తున్న ఉద్యోగుల ఇళ్లను విజిలెన్స్ ద్వారా తనిఖీ చేయించి అన్యమతస్తులను గుర్తించేలా బోర్డు తీర్మానం చేస్తామంటూ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ప్రకటన చేశారు. దీనిపై కూడా చర్చ జరగనున్నట్లు తెలిసింది.

అధికారులపై చైర్మన్ అసహనం

ఇప్పటివరకు బోర్డులో చేసిన తీర్మానాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ టీటీడీ బోర్డు చైర్మన్ అధికారులుపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తిరుమలలో మంగళవారం ధర్మకర్తల మండలి సమావేశం జరుగనున్న నేపథ్యంలో సోమవారం తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. చైర్మన్‌తో పాటు ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, వివిధ విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. నూతనంగా పెట్టబోయే అజెండా అంశాలపై చర్చిస్తున్న క్రమంలో ఇప్పటికే తీర్మానం చేసిన వాటి అమలులో ఎందుకు ఆలస్యం చేస్తున్నారంటూ ఈవోపై చైర్మన్ ఆగ్రహించినట్లు తెలిసింది. వ్యక్తిగత అజెండాలు ఎవరికి లేవనీ, పరిపాలనపరంగా సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తూ అన్నిటిని ఒక్కొక్కటిగా అమలుచేస్తూ వస్తున్నామని ఈవో కూడా బదులిచ్చినట్లు సమాచారం. కొంతసమయానికే అందరు సర్దుకుని సమావేశాన్ని ముగించినట్లు తెలిసింది.

డీసీసీబీ విభజన!

- తిరుపతికి ఏర్పాటుకానున్న కొత్త సహకార బ్యాంకు
- చిత్తూరు బ్యాంకు పరిధిలోనే అన్నమయ్య జిల్లా శాఖలు



చిత్తూరు కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వందేళ్లకు మించి చరిత్ర కలిగి సహకార రంగంలో తన ప్రత్యేకతను చాటుకుంటున్న చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) విభజనకు లోనుకానుంది.రాష్ట్రవ్యాప్తంగా 13 డీసీసీబీలుండగా ప్రాథమికంగా చిత్తూరు, కర్నూలుతో పాటు ఇతర ప్రాంతాల్లోని నాలుగు వెరసి ఆరు డీసీసీబీల విభజనకు ప్రభుత్వం ఆలోచిస్తోంది.తొలిదశలో ఆరు డీసీసీబీలను 12గా విభజించి, వాటి పనితీరును పరిశీలించాక మిగిలిన ఏడు డీసీసీబీలను విభజించనున్నట్లు సమాచారం.

2022 ఏప్రిల్‌లో జిల్లాల పునర్విభజన జరిగింది. కానీ అప్పట్లో డీసీసీబీ, డీసీఎంఎస్ (జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ) విభజన జరగలేదు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోనే డీసీసీబీ, సీడీసీఎంఎస్ కొనసాగుతున్నాయి.పరిపాలనా సౌలభ్యం కోసం డీసీసీబీలను పునర్వ్యవస్థీకరించాలని సహకారశాఖ చర్యలు చేపట్టింది. జిల్లాకొక డీసీసీబీని ఏర్పాటు చేసే దిశగా అడుగులేస్తోంది. ప్రస్తుతం చిత్తూరులో కొనసాగుతున్న డీసీసీబీ పరిధిలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని 75 సింగిల్ విండోలు(ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు)న్నాయి, 40 బ్యాంకు శాఖలున్నాయి. తిరుపతి, అన్నమయ్య జిల్లా కేంద్రాల్లో డీసీసీబీ తరపున డీజీఎం స్థాయి అధికారులకు కార్యాలయం ఏర్పాటు చేశారు.అక్కడి కలెక్టర్లు జరిపే జిల్లా స్థాయి సమావేశాలకు ఆయా అధికారులు హాజరవుతున్నారు. ప్రస్తుత చిత్తూరు డీసీసీబీ పరిధిలో 75 సింగిల్ విండోలుండగా, జిల్లాలవారీగా చిత్తూరులో 37, తిరుపతిలో 23, అన్నమయ్యలో 15 విండోలు కొనసాగుతున్నాయి. బ్యాంకు శాఖలవారీగా చిత్తూరులో 20, తిరుపతిలో 14,అన్నమయ్యలో 6 బ్యాంకు శాఖలున్నాయి.చాలా సంవత్సరాలుగా ఎన్నికలు జరక్కపోవడంతో మొన్నటి వరకు త్రిసభ్యకమిటీలతో సింగిల్ విండోలు, సెవెన్‌మెన్ కమిటీతో డీసీసీబీ,సీడీసీఎంఎస్ కొనసాగాయి. తాజాగా ప్రభుత్వం సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీలను వేయగా, డీసీసీబీ, సీడీసీఎంఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జులను చైర్మన్లుగా నియమించింది. త్వరలో సహకార సంస్థలకు ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ఉంది. డీసీసీబీలను విభజించి ఎన్నికలకు వెళితే ఎలా ఉంటుంది, లేదా ఉమ్మడి జిల్లా డీసీసీబీలకు ఎన్నికలు జరిపి,ఆ తర్వాత విభజిస్తే ఎలా ఉంటుంది అని ప్రభుత్వం ఆలోచిస్తోంది.అయితే సహకార శాఖ ఉన్నతాధికారుల సంకేతాల ప్రకారం ఎన్నికలకు ముందే తొలి, మలి దశల్లో డీసీసీబీలను విభజించే అవకాశం ఉందని తెలుస్తోంది.

జిల్లా	బ్యాంకు శాఖలు	సింగిల్ విండోలు
చిత్తూరు	20	37
తిరుపతి	14	23
అన్నమయ్య	06	15
మొత్తం	40	75

తిరుపతి డీసీసీబీపై కసరత్తు

డీసీసీబీ విభజన జరిగితే తిరుపతి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఏర్పాటుకు ఇప్పటినుంచే చర్యలు ప్రారంభిస్తే ఎన్నికల నాటికి ఒక కొలిక్కి వస్తాయని అధికారులు భావిస్తున్నారు. అన్నమయ్య జిల్లాను మాత్రం చిత్తూరు డీసీసీబీలోనే కొనసాగించనున్నారు. విభజన జరిగితే తిరుపతి జిల్లాకు కొత్తగా అధికారులు, ఉద్యోగుల సర్దుబాట్లు, కార్యాలయ భవనాలు, సమావేశ మందిరాలు ఏర్పాటు చేయాల్సివుంటుంది. కాగా తిరుపతిలో డీసీసీబీ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు కోసం రెండువేల చదరపు అడుగుల స్థలాన్ని కేటాయించాలని ఆ జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌ను బ్యాంకు అధికారులు కోరినట్లు సమాచారం.

రేపు కలెక్టరేట్‌లో స్పీకర్ సమీక్ష

తిరుపతి(కలెక్టరేట్),జూలై21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కేంద్రంగా సెప్టెంబరులో జరుగనున్న జాతీయ మహిళా సాధికారత సదస్సు నిర్వహణ ఏర్పాట్లపై శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్షిస్తారు. రెండు రోజుల జిల్లా పర్యటన నిమిత్తం మంగళవారం సాయంత్రం 4గంటలకు ఆయన వస్తారు.

11 నుంచి బీఈడీ రెండవ సెమిస్టర్ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో ఆగస్టు 11వ తేదీ నుంచి బీఈడీ రెండవ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.11 నుంచి 14వ తేదీ వరకూ ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఫీజు చెల్లింపునకు జూలై 28వ తేదీ చివరి గడువుగా నిర్ణయించారు. జ్ఞానభూమి.. వెబ్‌సైట్‌లో అప్లికేషన్ అందుబాటులో ఉంచారు.

ఆఫీసర్ వర్సెస్ అటెండర్

- రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో వివాదం
- పోలీస్ స్టేషన్లో పరస్పరం ఫిర్యాదులు



సబ్ రిజిస్ట్రార్‌తో మాట్లాడుతున్న అటెండర్ తిరుమలేశ్, దళిత సంఘం నాయకులు

రేణిగుంట జూలై 21(ఆంధ్రజ్యోతి) : జిల్లా అధికారి ఇచ్చిన ఉత్తర్వు మేరకు అటెండర్‌ను విధుల్లోకి తీసుకోకుండా సబ్ రిజిస్ట్రార్ తిరస్కరించడంతో చెలరేగిన వివాదం పోలీస్ స్టేషన్లో పరస్పరం ఫిర్యాదుల వరకు దారితీసింది. రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న ఎస్.తిరుమలేశ్‌ను ఫిబ్రవరి నెలలో ఓ విచారణ నిమిత్తం డిప్యుటేషన్‌పై సత్యవేడుకు పంపారు. తనను డిప్యుటేషన్‌పై పంపడం సరికాదని ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో రేనిగుంటలోనే కొనసాగించమంటూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. ఆ మేరకు జిల్లా రిజిస్ట్రార్ రేణిగుంటలోనే పనిచేయాల్సిందిగా తిరుమలేశ్‌కు ఉత్తర్వులు ఇచ్చారు. విధుల్లో చేరేందుకు గత సోమవారం రేణిగుంట కార్యాలయానికి వెళ్లడంతో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద్ రెడ్డి అంగీకరించలేదు. రోజూ కార్యాలయానికి వెళుతున్నా అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేయనీకపోవడంతో తిరుమలేశ్ సోమవారం ఎమ్మార్పీఎస్ నేతలతో కలసి ఎస్ఆర్ కార్యాలయానికి వెళ్లారు.ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.పరస్పరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ విషయంపై దళిత సంఘం నాయకుడు గోపి మీడియాతో మాట్లాడుతూ అటెండరు దళితుడని లెక్కనేనితనంతో ఆనంద్ రెడ్డి వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు.'నిన్ను పనిలో పెట్టుకోను ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో..' అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి అవమానించారని ఈ విషయంపై సబ్ రిజిస్ట్రార్ ఆనంద్ రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశామన్నారు. సబ్ రిజిస్ట్రార్ ఆనంద రెడ్డి మాట్లాడుతూ అటెండర్ ప్రవర్తన సరిగ్గా లేని అటెండర్ తిరుమలేశును విధుల్లో చేర్చుకోనని ఇదివరకే జిల్లా రిజిస్ట్రార్‌కు తెలిపానన్నారు. అయితే కొంతమంది దళిత సంఘ నాయకులను తీసుకువచ్చి తనపై దౌర్జన్యం చేయడమే కాకుండా విధులకు ఆటంకం కలిగించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.కాగా ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో కేసులు నమోదు చేస్తే ఇబ్బందని పోలీసులు చెప్పడంతో ఇరువర్గాలూ వెనకడుగు వేసినట్లు సమాచారం. తర్వాత అక్కడ నుంచి జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామ్‌కుమార్ వద్దకు పంచాయితీ మారినట్టు తెలిసింది. చివరకు వారిద్దరూ రాజీపడి ఫిర్యాదులను వెనక్కు తీసుకున్నారు. అటెండర్‌ను విధుల్లోకి తీసుకునేందుకు సబ్ రిజిస్ట్రార్ అంగీకరించినట్లు తెలిసింది.

చంద్రగిరి

ఉభయ దేవేరులతో తిరుచ్చిపై శ్రీకృష్ణుడి సాక్షాత్కారం



తిరుచానూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువై ఉన్న రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడు సోమవారం బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రం రోహిణిని పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు విశేషాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

తిరుచ్చిపై రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడి దర్శనం

చంద్రగిరి, జూలై 21(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు ఉత్సవర్లు భక్తులకు దర్శనమిచ్చారు. ఈకార్యక్రమంలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'పాండవ అజ్ఞాతవాసం'

రామచంద్రాపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): రామాపురం మహాభారత ఉత్సవాల్లో భాగంగా భాగవతారిణి అనసూయ ప్రదర్శించిన పాండవ అజ్ఞాతవాసం సభికులను ఆకట్టుకుంది. పాండవులు అరణ్యావాసం వీడి మారువేషాల్లో విరాటరాజు కొలువు చేరుతారు. అనంతరం నర్తనశాలలో అర్జునుడు బృహన్నలగా మారి గోమందను తరలించే దృశ్యాలను భాగవతారిణి రమ్యంగా వినిపించారు. ఆలయంలో విశేష పూజలు నిర్వహించి ద్రౌపదీ సమేత ధర్మరాజులకు తిరుమంజనం అనంతరం ప్రత్యేక అలంకరణ చేపట్టారు. సాయంత్రం మేళ తాళాల నడుమ ఉత్సవమూర్తుల ఊరేగింపు జరిగింది.

నాలుగోరోజుకు చేరిన లక్ష్మీ కుబేర యాగం

రామచంద్రాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రామాపురం బ్రహర్షిపీఠంలో నిర్వహిస్తున్న లక్ష్మీ కుబేర యాగం సోమవారం నాలుగవ రోజుకు చేరుకుంది. 108 యజ్ఞకుండాల్లో శాస్త్రోక్తంగా లక్ష్మీ కుబేర హోమాన్ని ప్రారంభించి 12గంటలకు పూర్ణాహుతితో ముగించారు. మహారాష్ట్ర ఆధ్యాత్మిక గురువు శాంతి గిరి జన ప్రభువు భక్తులకు ఆధ్యాత్మిక ప్రసంగాలు వినిపించారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు సన్మానం



విజయలక్ష్మిని సన్మానిస్తున్న సచివాలయ సిబ్బంది

రామచంద్రాపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలం అనుపల్లి సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మి చంద్రగిరి మండలం దోర్నకంబాల సచివాలయానికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆమెను సచివాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బిందుమాధవి, టీడీపీ నాయకులు విజయకుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకటేష్ నాయుడు, దేవరాజులు, మహేష్, కుమార్, లోకేష్, వెంకటేష్, వెంకటముని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో పీ4 గ్రామసభ

తిరుపతిరూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ సుబ్బరామిరెడ్డి అధ్యక్షతన సోమవారం పీ4 గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఇటీవల పంచాయతీల్లో నిర్వహించిన సర్వేలో నీటికుళాయిలు, గ్యాస్, కరెంట్ కనెక్షన్, బ్యాంక్ అకౌంట్లు, ప్రభుత్వ పథకాలు తీసుకోని 189మంది పేదలను గుర్తించామన్నారు. వీరిని ప్రభుత్వ పథకాలకు అర్హులుగా గుర్తించామని వివరించారు. ఎంపీటీసీ బుజ్జమ్మ, ఉపసర్పంచ్ గోపాల్‌రెడ్డి, వార్డుసభ్యులు, టీడీపీ వాణిజ్యవిభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బిరుదాల భాస్కర్‌రెడ్డి, కేశవులుశెట్టి, సరస్వతి, జయచంద్రారెడ్డి, సుబ్రమణ్యం, వెంకటేష్‌నాయుడు, మనోహర్, మహేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో
పోతురాజు విగ్రహం చోరీ

● గుప్తనిధుల కోసమే తవ్వకాలంటున్న పోలీసులు

చంద్రగిరి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, శానంబట్ల గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ ఆలయ ఆవరణలో ఉన్న పోతురాజు విగ్రహం చోరీకి గురైంది. పోలీసుల కథనం మేరకు ముత్యాలమ్మ ఆలయ ఆవరణలో ప్రవేశ ద్వారం వద్ద పురాతన కాలం నుంచి ఉన్న పోతురాజు విగ్రహాన్ని ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీ చేయడంతో పాటు విగ్రహం కింద భాగంలో లోతుగా పూడిక తీశారు. సోమవారం ఉదయం గ్రామస్తులు ఆలయానికి చేరుకుని పరిశీలించగా పోతురాజు విగ్రహం చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, సమీపంలో ఉన్న సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. విగ్రహాల చోరీ వెనుక గుప్త నిధుల తవ్వకాల బృందం ఉన్న అనుమానిస్తున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పోతురాజు విగ్రహం ఉన్న చోట తవ్వేసిన దృశ్యం

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 55 వినతులు



సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, జూలై 21(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న తరుణంలో నగరంలోని ప్రజలు, అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల అధికారులతో మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, కార్పొరేటర్లు అనీష్ రాయల్, పునీత కోరారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపడుతున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని కార్పొరేటర్ ఎస్.కె.బాబు కోరారు. నగరంలో నెలకొన్న సమస్యలను ఆయా విభాగాల అధికారులు వెంటనే పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ తులసికుమార్, గోమతి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, డీసీపీ ఖాన్, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నానీకి పరామర్శ



పులివర్తి నాని తల్లి లక్ష్మీభారతి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

పాకాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పులివర్తి నానీని సోమవారం పలువురు పరామర్శించారు. ఎమ్మెల్యే మాతృమూర్తి లక్ష్మీభారతి మృతిచెందిన నేపథ్యంలో పలువురు నాయకులు మండలంలోని పులివర్తివారిపల్లెలో నానీని కలిశారు. ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడులు లక్ష్మీభారతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నానీని, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్ నాగరాజు, పక్కన ఎంపీడీవో రామచంద్ర, డిప్యూటీ ఎంపీడీవో దయాసాగర్

తిరుపతిరూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై మండల, పంచాయతీస్థాయి అధికారులు అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో కె.రామచంద్ర తెలిపారు. తిరుపతిరూరల్ మండల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. దరఖాస్తుల పరిశీలన, సమాచారాన్ని అందించే పద్ధతులు, అప్పీలు వంటి అంశాల గురించి వివరించారు. రిసోర్స్‌పర్సన్ నాగరాజు, డిప్యూటీ ఎంపీడీవో దయాసాగర్, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెద్ద పుష్పపల్లకిలో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ



విశేషాలంకరణలో కనకదుర్గమ్మ

చంద్రగిరి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, శ్రీనివాసమంగాపురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో వార్షిక ఉత్సవాల్లో భాగంగా సోమవారం కనకదుర్గమ్మ పెద్ద పుష్పపల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారి మూల విరాట్‌కు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి, విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన పెద్ద పుష్పపల్లకీలో అధిష్ఠింపజేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన సింగు వంశస్థులు, శ్రీనివామంగాపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్రగ్ డెవలప్‌మెంట్‌లో క్లినికల్ ఫార్మకాలజీ కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వర్ ఆర్ బుద్ధ

రామచంద్రాపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఔషధ అభివృద్ధిలో క్లినికల్ ఫార్మకాలజీ ప్రాత కీలకమని బివన్ మెడిసెన్స్ డైరెక్టర్ నాగేశ్వర ఆర్ బుద్ధ తెలిపారు. మండలంలోని వెంకట్రామాపురం సమీపంలో ఉన్న సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో సోమవారం క్లినికల్ ఫార్మకాలజీ ఇన్ డ్రగ్ డెవలప్‌మెంట్ అనే అంశంపై జాతీయ వర్క్‌షాప్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈకార్యక్రమానికి వక్తగా హాజరైన స్విట్జర్లాంట్‌కు చెందిన నాగేశ్వర్ ఆర్ బుద్ధ మాట్లాడుతూ ఔషధం శరీరంలోకి ఎలా ప్రవేశిస్తుంది, ప్రవేశించిన తరువాత దాని ప్రభావం ఎలా ఉంటుందనే దానిపై అంచనా వేయడంలో క్లినికల్ ఫార్మకాలజీ ప్రముఖపాత్ర పోషిస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో ఔషధాలు ప్రీ క్లినికల్ విభాగంలో విఫలమవుతున్నాయని, క్లినికల్ ఫార్మకాలజీ ద్వారా క్లినికల్ దశకు ఔషధాలు చేరుకుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

షియాల రక్తతర్పణం



పీర్ల ఊరేగింపు

గంగాధరనెల్లూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి):గంగాధరనెల్లూరు మండలం బాలగంగనపల్లెలో షియా ముస్లింలు సోమవారం అజాదారి మాతమ్ (రక్తతర్పణం) నిర్వహించడంతో పాటు పీర్లను ఊరేగించారు.మొహర్రం పండుగ తరువాత 25వరోజైన ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు షియా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.శతాబ్దాల క్రితం యజీద్ అనే పాలకుడి చేతిలో బలైపోయిన ఇమామ్ హుస్సేన్,ఆయన కుటుంబసభ్యులు, బంధువులు, అనుచరుల త్యాగాలను స్మరించుకుంటూ షియాలు బాధాతప్త హృదయంతో పీర్లను ఊరేగించారు. తరువాత పిల్లలు, యువకులు, పెద్దలు వారిశరీరాలపై పదునైన బ్లేడ్‌లు, చాకులతో కొట్టుకుంటూ రక్తం చిందించారు. అనంతరం పలువురికి అన్నదానం చేశారు.



షియాల రక్తతర్పణం

ఎస్వీయూలో స్వయం కోర్సులకు మంచి స్పందన



ప్రశంసాపత్రంతో వీసీ అప్పారావు తదితరులు

● సైన్స్ కాలేజీకి స్వయం - ఎన్‌పీటీఈఎల్ నుంచీ ప్రశంస

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ నూతన విద్యా విధానం-2020లో భాగంగా విద్యార్థులు స్వయంగా ఆన్‌లైన్ ద్వారా శిక్షణ పొందేందుకు 'స్వయం' కోర్సులను అమలు చేస్తున్నారు. ఐఐటీ, ఎన్ఐటీ, సెంట్రల్ యూనివర్సిటీలు ఈ విధానంలో కీలక భూమిక పోషిస్తున్నాయి. ఎస్వీయూ కూడా స్వయం కోర్సులను ప్రవేశపెట్టింది. దీనికి విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చింది. దీనిపై స్వయం - ఎన్‌పీటీఈఎల్ నుంచి యూనివర్సిటీ సైన్స్ కాలేజీకి ప్రశంసలు లభించాయి. ఎక్కువ మంది విద్యార్థులు సైన్స్ కాలేజీ నుంచి స్వయంలో నమోదు చేసుకుని, ఉత్తీర్ణులై, సర్టిఫికెట్లు సైతం పొందారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ప్రిన్సిపాల్ పద్మావతి, స్వయం ఇన్‌చార్జి భారతి, మీడియా డీన్ పీసీ వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. దివ్యాంగ విద్యార్థులకు స్వయం కోర్సులకు దరఖాస్తు చేసుకోవడంలో ఫీజు రాయితీ ఉండటం మంచి పరిణామమని అన్నారు.

బ్యాడ్మింటన్ విజేతకు అభినందనలు



అండర్-20 జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ విజేత జ్యోత్స్నను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పాకాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం విద్యార్థిని జ్యోత్స్న అండర్-20 జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ (షటిల్) పోటీల్లో విజేతగా నిలిచారు. చిత్తూరు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆదివారం తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన పోటీల్లో విజేతగా నిలిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. సోమవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ కుమార్, అధ్యాపకులు, సహ విద్యార్థులు జ్యోత్స్నను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మాశిలామణి, క్రీడా విభాగం సమన్వయకర్త ఆదిశేఖరరెడ్డి, అధ్యాపకులు చిట్టికళావతి, ఈశ్వరబాబు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

టమోటా 'ధర'హాసం

● రూ.700 పలికిన 15 కిలోల బాక్స్



మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా టమోటాలు

సోమల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా టమోటా రైతుల పంట పండుతోంది. అనూహ్యంగా ధర పైపైకి ఎగబాకడంతో వీరి ముఖాన ఆనందం వెల్లివిరిసింది. సోమవారం అనూహ్యంగా 15 కిలోల బాక్సు ధర రూ. 700కి చేరుకుంది. ఆదివారం రూ. 450 పలికింది. రెండు రోజుల వర్షాలకు రైతులు టమోటాలను కోయడం లేదు. దీంతో మార్కెట్‌కు తక్కువగా పంట ఉత్పత్తులు వచ్చాయి. డిమాండ్‌కు సరిపడే టమోటాలు లేకపోవడంతో పోటీ పెరిగి ధరలు పుంజుకున్నాయి. మదనపల్లె మార్కెట్‌లో 22 కేజీల బాక్సు రూ.1100, కోలారు మార్కెట్‌లో 15కిలోల బాక్సు రూ.700, చిన్నమండ్యంలో రూ.750, ములకలచెరువులో రూ.800, పుంగనూరు లో 15కిలోల బాక్సు రూ.700కు చేరుకుంది. ధరలు పెరుగుతుంటే మరోపక్క వర్షాలకు తోటలు దెబ్బతింటున్నాయి. ఉన్న కొద్ది పంటను కాపాడుకోవడానికి రైతులు చీడపీడల నివారణకు మందుల పిచికారీ చేస్తున్నారు. ఏప్రిల్‌లో నాట్లు వేసిన పొలాల్లో ఇప్పుడు దిగుబడులు వస్తున్నాయి.

పుంగనూరులో కిలో టమోటా రూ.41

పుంగనూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం కిలో టమోటా ధర రూ.41 పలికింది. మార్కెట్‌లో రైతుల నుంచి మొదటి రకం రూ.41, రెండోరకం రూ.38, మూడో రకం రూ36 చొప్పున కొనుగోలు చేశారు. వ్యాపారులు 538.86 మెట్రిక్ టన్నుల టమోటాలను కొనుగోలు చేసి డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలించారు. ఆదివారం మొదటి రకం రూ. 28.70, రెండో రకం రూ.26.70, మూడో రకం రూ. 24.70 చొప్పున ధర పలుకగా ఒక్క రోజులోనే కిలో రూ.11 పెరగటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తిరుమలలో ప్రముఖులు





జస్టిస్ చంద్రకుమార్ - ఎస్.ప్రసాద్

తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీ చంద్రకుమార్, రాష్ట్ర మంత్రి సంధ్యారాణి, మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్‌రావు, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ప్రాసిక్యూషన్స్ జిల్లా డైరెక్టర్ ఎస్.ప్రసాద్, తిరుపతి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయశేఖర్ ఉన్నారు. కాగా దర్శనం అనంతరం మంత్రి సంధ్యారాణి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా కాపాడాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కోదండరామాలయంలో పవిత్రాల సమర్పణ

తిరుపతి అర్బన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కోదండరామాలయంలో సోమవారం పవిత్రాల సమర్పణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుతగా సీతారామలక్ష్మణుల ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేశారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కుంభారాధన, హోమం చేపట్టారు. అనంతరం స్నపన తిరుమంజనం నిర్వహించి ప్రదక్షిణగా సన్నిధికి వేంచేశారు. ఈ సందర్భంగా ధ్రువమూర్తులు, కౌతుకమూర్తులు, స్నపనమూర్తులు, బలిమూర్తులకు పవిత్రాలు సమర్పించారు. అలాగే విష్వక్సేన, ద్వార పాలకులు, భాష్యకారులు, గరుడాళ్వార్, యాగశాలలోని హోమగుండాలు, బలిపీఠం, ధ్వజస్తంభం, ఆలయం ఎదురుగా ఆంజనేయస్వామికి సైతం పవిత్రాలను సమర్పించారు. సాయంత్రం సీతారామలక్ష్మణులు బంగారు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో విహరించారు. యాగశాలలో వైదిక కార్యక్రమాలు చేపట్టారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), జూలై 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలో మంగళవారం విద్యుత్ తీగల మరమ్మతులు, చెట్టు కొమ్మలు తొలగించనున్నందున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఎస్‌టీవీనగర్, న్యూఇందిరానగర్ సమీప ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ విన్నకోటి చంద్రశేఖరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

31వ డివిజన్‌లో 'తొలి అడుగు'


కరపత్రాలు అందజేస్తున్న సుగుణమ్మ తదితరులు

తిరుపతి, జూలై 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని 31వ డివిజన్లో సోమవారం తిరుపతి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి సుగుణమ్మ ఆధ్వర్యంలో తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి చెప్పడంతో పాటు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో మాజీ మంత్రి పరసారత్నం, క్లస్టర్ ఇంచార్జి దంపూరి భాస్కర్ యాదవ్, నాయకులు మూర్తి యాదవ్, బాలయ్య, గణపతి, గజేంద్ర, అశోక్, రాజయ్య, ఉమాపతి, విజయ తదితరులు పాల్గొన్నారు.

టైటాన్ షోరూం ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి బీసీ జనార్దన రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తదితరులు

తిరుపతి, జూలై 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన టైటాన్ షోరూంను సోమవారం ఉదయం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. టీడీపీ నేతలు చినబాబు, రజనీకాంత్ నాయుడు, షోరూం యజమాని ప్రభాకర్, టైటాన్ కంపెనీ సౌత్ హెడ్ అజయ్ ద్వివేది, ఏపీ హెడ్ అజయ్ మౌర్య, ఏబీఎం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బలిజ భవన్ పూర్తి చేయాలని సీఎంకు వినతి


చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఆర్కాట్ కృష్ణప్రసాద్

తిరుపతి(ఆటోనగర్), జూలై 21(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అసంపూర్తిగా వున్న బలిజ భవన్‌ను పూర్తి చేయడాకి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు జనసేన, బలిజ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ వినతిపత్రం ఇచ్చారు. తిరుపతి పర్యటనలో భాగంగా తిరుపతి విమానాశ్రయానికి వచ్చిన సీఎంను కలసి బలిజ భవన్ అసంపూర్తిగా వున్న వివరాలను వివరించామన్నారు. సీఎం సానుకూలంగా స్పందించి త్వరలోనే భవన నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుందామని చెప్పారని కృష్ణప్రసాద్ తెలిపారు.

కేరళ మాజీ సీఎంకు సీపీఎం నివాళి


అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తిరుపతి(ఆటోనగర్), జూలై 21(ఆంధ్రజ్యోతి): సీపీఎం నేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్‌కు సోమవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. కేరళలోని తిరువనంతపురంలో సోమవారం అచ్యుతానందన్ మృతి చెందారు. ఈ సందర్భంగా తిరుపతి పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, నాయకులు టి.సుబ్రమణ్యం, బాలసుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర, పి.సాయిలక్ష్మి, మాధవ్, బుజ్జి, అక్బర్, రవి తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

ఎస్‌సీఆర్‌ఎంయూ జోనల్ కార్యదర్శికి ఘన స్వాగతం


శంకర్‌రావుకు స్వాగతం పలుకుతున్న తిరుపతి నాయకులు

తిరుపతి(సెంట్రల్), జూలై 21(ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వేస్టేషన్‌లో సోమవారం సౌత్ కోస్ట్ రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్‌ఎంయూ) జోనల్ కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన సీహెచ్ శంకర్‌రావుకు తిరుపతి శాఖ మజ్దూర్ యూనియన్ నాయకులు ఘన స్వాగతం పలికారు. నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో ఆయన రేణిగుంటకు చేరుకున్న సమాచారం తెలుసుకున్న నాయకులు శంకర్‌రావుకు పూలమాలలు వేసి, దుశ్శాలువాతో సన్మానించారు. నాయకులు సురేష్‌కుమార్, రవీంద్రనాయక్, కేఎస్ గౌస్‌బాషా, గుంతకల్లు డివిజన్ మాజీ అధ్యక్షుడు సుదర్శన్ రాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తత అవసరం



మహిళలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఉమాదేవి

తిరుపతిరూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): సైబర్‌నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని పద్మావతి మహిళావర్సిటీ మహిళా అధ్యయన కేంద్రం ప్రొఫెసర్ డాక్టర్ డి.ఉమాదేవి సూచించారు. తిరుపతిరూరల్ మండలం పుదిపట్ల గ్రామ సచివాలయంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు సోమవారం సైబర్‌నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో టెక్నాలజీపై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోందని, దీనివల్ల వ్యక్తిగత, ఆర్థిక, భద్రతపరమైన నష్టాలు కూడా ఉన్నాయన్నారు. బ్యాంకింగ్, హ్యాకింగ్, సైబర్‌స్టాకింగ్, డేటా చోరీ వంటి మోసాలు ఉన్నాయని, గుర్తుతెలియని లింకులు, ఈమెయిల్స్‌ని ఓపెన్ చేయొద్దని, గుర్తుతెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోరాదని, అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినట్లయితే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు తెలియపరచాలని సూచించారు. సంఘమిత్ర మునెమ్మ, మహిళా పోలీసు శ్రీలక్ష్మి, అధ్యయన కేంద్రం ప్రాజెక్ట్ అసిస్టెంట్ డాక్టర్ ఎం.ఇంద్రాణి, మహిళలు పాల్గొన్నారు.

'సారీ రాంగ్ నెంబర్'

● పాశ్యాత్య పోకడలతో పతనమవుతున్న వివాహ బంధానికి దర్పణం


సారీ రాంగ్ నెంబర్ నాటక ప్రదర్శన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 21 (ఆంధ్రజ్యోతి): పాశ్చాత్య విష సంస్కృతి ప్రభావంతో పతనమవుతున్న భారతీయ సంప్రదాయ విలువల తీరును 'సారీ రాంగ్ నెంబర్ నాటకం' కళ్ళకు కట్టింది. అభినయ ఆర్ట్స్ - హనుమ అవార్డ్సు రజతోత్సవంలో భాగంగా మహతి కళాక్షేత్రంలో సోమవారం పలు నాటకాలను ప్రదర్శించారు. ఏలూరుకు చెందిన హేలాపురి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చింతల మల్లేశ్వరరావు రాసిన ఈ నాటకానికి మహమ్మద్ ఖాజావలి దర్శకత్వం వహించారు. భార్యాభర్తల బంధానికి నిదర్శనంగా ఉన్న భారతీయ సంస్కృతిని పాశ్చాత్య సంస్కృతి ఎలా నాశనం చేసిందో నాటకం వివరించింది.. చాటింగులు, డేటింగులు, క్లబ్బులు, పబ్బులు, సహజీవనాలు అంటూ భ్రష్టుపడుపోతున్న వ్యవస్థలో ఓ కుమారుడిని కాపాడుకోవడానికి తండ్రి పడే ఆరాటం, ఇల్లాలు చేసిన పోరాటం ఈ నాటకానికి ప్రధాన ఇతివృత్తం. నాటకంలో భవానీ, శ్రీనివాసరావు, విజయకుమార్, జ్యోతి పాత్రల్లో ఒదిగిపోయారు. ఖమ్మంకు చెందిన భక్త రామదాసు కళామండలి ఆధ్వర్యంలో 'విష్ణువర్ధనుడు' పద్య నాటక ప్రదర్శన నిర్వహించారు. గంగాచార్యులు దర్శకత్వం వహించారు. అంతకుముందు వివిధ సంగీత, నృత్య ప్రదర్శనలు సాగాయి. కళాకారులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో అభినయ ఆర్ట్స్ అధ్యక్షులు మబ్బు సూర్యనారాయణరెడ్డి, కార్యదర్శి బి.నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు ఏనుగు అంకమ నాయుడు, కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో భూమికి జీవం

● కలెక్టర్ వెంకటేశ్వర్


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 21(ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట వాడకం ద్వారా ఎరువులు ఆదా అవడంతో పాటు భూమికి జీవం వస్తుందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ అధికారులతో కలిసి సోమవారం కలెక్టర్ పచ్చిరొట్టతో ఎరువుతో మట్టికి జీవం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షానికి ముందు జీవన ఎరువులు వినియోగిస్తే పదిశాతం రసాయన ఎరువులు ఆదా చేయవచ్చన్నారు. జిల్లాలోని రైతులందరూ పచ్చిరొట్ట ఎరువులను, జీవన ఎరువులను రైతు సేవా కేంద్రాల వద్ద రాయితీపై కొనుగోలు చేసి వినియోగించాలని సూచించారు. దీంతో పోషక విలువలు కలిగిన పంటలు పండించడమే కాకుండా పర్యావరణానికి మేలు చేసిన వారవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాశాఖాధికారి ప్రసాదరావు, డీపీఎం షణ్ముగం, రైతు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఒక కుటుంబంలోని ఓట్లన్నీ ఒకే కేంద్రంలో'


సమావేశంలో మాట్లాడుతున్న మౌర్య

తిరుపతి, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఒకే కుటుంబంలోని వారి ఓట్లు ఒకే కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య అన్నారు. తిరుపతి నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాల మేరకు సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో 274 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 90 కేంద్రాల్లో 1200కు పైన ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1200 ఓట్లు కంటే ఎక్కువ ఉంటే సమీపంలోనే మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కొత్త పోలింగ్ కేంద్రాల వివరాలు అందరూ పరిశీలించి అభిప్రాయం తెలపాలని కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి పరిష్కరిస్తామని అన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ రఘువంశీ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఈడీటీ సుధాకర్‌నాయక్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జర్మనీలో ఉద్యోగావకాశాలు

● నర్సింగ్ కోర్సు చేసిన వారికి ఉచిత శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), జూలై 21(ఆంధ్రజ్యోతి): నర్సింగ్‌కోర్సులు పూర్తిచేసిన వారికి జర్మనీ వంటి దేశాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సాంఘిక సంక్షేమాధికారి విక్రమ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో తిరుపతి నగరంలో షెడ్యూల్‌కులాలకుచెందిన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, జీఎన్‌ఎం నర్సింగ్ పూర్తిచేసిన వారు అర్హులని, వారికి ఉచితంగా పది నెలలు జర్మనీ భాషపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 80083 59664, 87906 54826 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఏబీఆర్‌ఎస్ జాతీయ నూతన అధ్యక్షుడిగా వెంకటరత్నం



తిరుపతి(ఆటోనగర్), జూలై 21(ఆంధ్రజ్యోతి): అఖిల భారత రచనాత్మక సమాజ్ (ఏబీఆర్‌ఎస్) జాతీయ నూతన అధ్యక్షుడిగా రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం నాయుడిని నియమించినట్లు ఆల్ ఇండియా హరిజన సేవక్ సంఘ్ జాతీయ అధ్యక్షులు శంకర్ కుమార్ సన్యాల్ వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినీ సేవా ధామ్ ఆశ్రమంలో ఆదివారం జాతీయ స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఖాళీగా వున్న అధ్యక్ష స్థానానికి ఆంధ్రప్రదేశ్‌లోని రాస్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న డాక్టర్ ఎస్.వెంకటరత్నం నాయుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం బీహార్ మాజీ ఎంపీ నరేష్ యాదవ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. వెంకటరత్నం నాయుడు మాట్లాడుతూ ఈ పదవి సేవా కార్యక్రమాలు అందించడానికి మరింత బాధ్యత పెంచిందన్నారు. అనతి కాలంలో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అధ్యక్షులను నియమించి గాంధేయవాదాన్ని, సిద్ధాంతాలను విస్తృత పరచడానికి కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి దేశంలోని అన్ని రాష్ట్రాలనుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. ఏబీఆర్‌ఎస్ నూతన అధ్యక్షుడిగా వెంకటరత్నం నాయుడు నియమితులైన సందర్భంగా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, జనరల్ బాడీ సభ్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

హరిహర వీరమల్లు సక్సెస్ కావాలి


కొబ్బరికాయలు కొడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): జనసేనాని, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నటించిన హరిహరవీరమల్లు సినిమా అఖండ విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం అలిపిరి పాదాల మండపం వద్ద 109 టెంకాయలు సమర్పించారు. గరుడ వలయం వద్ద సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించి గొప్ప విజయం సాధించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ డిప్యూటీ సీఎం అయిన తరువాత విడుదలవుతున్న చిత్రం హరిహరవీరమల్లు ద్వారా గొప్ప సందేశం ప్రజలకు ఇవ్వనున్నారని వివరించారు. జనశ్రేణులతో పాటు మెగా అభిమానులు సినిమా విజయవంతం కావడంలో భాగస్వాములు కావాలని కోరారు. జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి మాట్లాడుతూ హరిహరవీరమల్లు సినిమాతో పాత రికార్డులు తుడిచిపెట్టుకు పోతాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రేవతి, దూది కుమారి, శివ, శైలజ, యాదవకృష్ణ, వినోద్, సుభాషిణి, వనజ, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందుతున్నాయా..?


స్థానికులతో మాట్లాడుతున్న మేయర్ డాక్టర్ శిరీష, అభినయ్

తిరుపతి(జీవకోన), జూలై 21 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు సకాలంలో అందుతున్నాయా అంటూ తిరుపతి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త భూమన అభినయ్ స్థానిక ప్రజలతో ఆరా తీశారు. సోమవారం మేయర్ డాక్టర్ శిరీషతో కలిసి చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందాలంటే మళ్లీ జగనన్నను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్ మురళీరెడ్డి, తులసియాదవ్, ఉదయ్ వంశీ, తమ్ముడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన


మాట్లాడుతున్న దశరథరామిరెడ్డి

తిరుపతి(ఎంఆర్ పల్లె), జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉద్యానాధికారి కార్యాలయంలో సోమవారం ఆ శాఖాధికారులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానశాఖాధికారి దశరథరామిరెడ్డి మాట్లాడుతూ సరైన పరిపాలనకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం సమాచారహక్కు చట్టం-2005 ప్రవేశపెట్టిందన్నారు. ఈ చట్ట ప్రకారం ప్రతి పౌరుడికి ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉన్న సమాచారం పొందే హక్కు ఉందన్నారు. జిల్లా సూక్ష్మ నీటిపారుదలశాఖాధికారి సతీష్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ విభాగం తమ వద్దఉన్న సమాచారాన్ని పారదర్శకంగా అందుబాటులో ఉంచాలన్నారు. పౌరులు ఆయా అధికారులను సంప్రదించి దరఖాస్తు ఫీజుతో కూడిన అర్జీ ఇస్తే నిర్ణీతకాల వ్యవధిలోపు సమాచారాన్ని ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో అప్పీల్స్ అధికారిని సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని మండల ఉద్యానాధికారులు పాల్గొన్నారు.

కనుల పండువగా కుమారస్వామి రథోత్సవం



పురవీధుల్లో రథంపై ఊరేగుతున్న సుబ్రహ్మణ్యస్వామి

శ్రీకాళహస్తి, జూలై 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలలో భాగంగా సోమవారం నిర్వహించిన రథోత్సవం కన్నులపండువగా సాగింది. ముందుగా ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామిని రథంపై అధిష్ఠింపజేసి చతుర్మాడ వీధుల్లో ఊరేగించారు. రథంపై ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని కర్పూర హారతులు సమర్పించారు.

నేత్రపర్వంగా తెప్పోత్సవం : శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామిని మొదట అలంకార మండపంలో విశేషంగా అలకరింపజేసి మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య నారద పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. అక్కడస్వామి అమ్మవార్లను తెప్పలపై అధిష్ఠింపజేసి నారద పుష్కరణిలో పూజలు చేశారు. అనంతరం తెప్పపై విహరిస్తున్న శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామిని దర్శించుకోవడానికి భక్తులు



తెప్పపై విహరిస్తున్న స్వామివారు

పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పుష్కరిణి వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


సర్వ దర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని ఓ షెడ్‌లో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.33 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 87,138

తలనీలాలు సమర్పించినవారు: 30,099



నట కెరటం

అభినయ ఆర్ట్స్ బీఎన్ రెడ్డి

పరిషత్తు పోటీలంటే నిర్వాహకులకు పెద్ద ప్రహసనంతో కూడుకున్న పని. ఆరు నెలలపాటు అనేకమంది కలిసి మోసే భారం.. అలాంటిది ఒకే ఒక్కడు తిరుపతి వేదికగా ఒక నాటక పరిషత్తును పాతికేళ్లుగా నడిపిస్తున్నాడు. ఆ సంస్థ పేరు అభినయ ఆర్ట్స్, ఆ వ్యక్తి పేరు బీఎన్ రెడ్డి. నటన ఆయన ప్రాణం, నటన ఆయన జీవితం. నటనే ఆయన ప్రపంచం. ఆ నిత్య నటనోత్సాహి నడుపుతున్న అభినయ ఆర్ట్స్ రజతోత్సవ వేడుకలు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా బీఎన్ రెడ్డి నట, జీవన యాత్ర.. ఆయన మాటల్లోనే..

తిరుపతి, ఆంధ్రజ్యోతి











దర్శకుడిగా సినిమా

దీన్ని చూసిన స్నేహితులు సినిమా చేయమని ప్రోత్సహించారు. తిరుపతి వైద్యులు డాక్టర్ కీర్తి, డాక్టర్ పార్థసారధి నిర్మాతలుగా 'సీతోనే హాయ్‌హాయ్' సినిమాను తీశాం. తెలుగుతోపాటు హిందీలో కూడా రిలీజ్ చేశాం. రెండో సినిమాకు కథను సిద్ధం చేసుకుంటున్నా.

లోహితాసుడిగా తొలి వేషం

మాది నెల్లూరు జిల్లా హసనాపురం. అమ్మానాన్నలకు ఐదుగురు సంతానం. 16 మంది మేనమామలు. ఉమ్మడి కుటుంబం. మా మేనమామలు అందరూ పౌరాణిక నాటకాలు ఆడేవారు. ఒక్కోసారి ఒక నాటకంలో అన్ని పాత్రలూ మా ఇంట్లోవాళ్లే వేసేవారు. స్త్రీ పాత్రలు మాత్రం వేసేవారు కాదు. మా నాన్న రామాయణ, భారతాల గురించి చెప్పేవారు. వీరందరినీ చూస్తూనే పెరిగాను. ఒకసారి మా ఊళ్లో సత్యహరిశ్చంద్ర నాటకం వేయాలనుకున్నారు. అందులో లోహితాసుడిగా నన్ను ఎంపిక చేసుకున్నారు. నాలుగు పద్యాలు నేర్పించి స్టేజి ఎక్కించారు. ఇక అక్కడి నుంచీ నాటకం నాకో వ్యసనంగా మారింది. హార్మోనియం సౌండ్ వినిపిస్తే చాలు బడి ఎగ్గొట్టేసేవాడిని. ఇంట్లో తిడతారని దూలం మీద నక్కి కూర్చుని ఇంట్లో జరిగే రిహార్సల్స్ చూస్తూ ఉండేవాడిని. ఇంటిలో మందలించినప్పటికీ దొంగచాటుగా ఇంటి దూలం ఎక్కి ఆలకించేవాడిని.

అప్పుడెక్కిన స్టేజీ ఇంకా దిగలేదు

నా 14వ ఏట డైరెక్టర్ అయిపోయాను. ఆగస్టు 15 సందర్భంగా స్కూల్‌లో నాటిక వేయాలనుకున్నాం. మా మాస్టారు కామేశ్వరరావు నన్ను పిలిచి 'మనుషులంతా ఒక్కటే' నాటికను ఇచ్చి 'నువ్వే డైరెక్టర్ నాటకామాడించు అన్నారు. అంతే.. అప్పుడు ఎక్కిన స్టేజీ ఇప్పటికీ దిగలేదు.

రంగస్థలం కోసం రిక్షా తొక్కా

మా నాన్న చనిపోయాక కుటుంబ భారం మీద పడింది. వానొస్తేనే వ్యవసాయం. పని వెతుక్కుంటూ నెల్లూరుకు చేరుకున్నా. పగలంతా బేల్దారి కూలీ.. రాత్రిళ్లు రిక్షా తొక్కేవాడిని. ఆ కష్టాన్ని ఇప్పటికీ మరవలేదు. అప్పుడూ నాటకాన్ని వదల్లేదు. ఒక మధురమైన అనుభవం ఏమిటంటే.. కూలీగా నేను ఇటుకలు మోసిన ఇంటికే పాతికేళ్ల తర్వాత అతిథిగా వెళ్లడం. అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శిగా నాటకం నాకు ఆ గౌరవం ఇచ్చింది.

ఆతిథ్యం అందుకున్నా. చేతితో గోడను నెమ్మదిగా తాకుతూ ఆనందబాష్పాలతో నిద్రపోయా. ఆరోజు నా జీవితంలో మరిచిపోలేనిది. 8ఏళ్ల క్రితం అభినయ ఆర్ట్స్ పనిమీద ప్రకాశం జిల్లాకు వెళ్లా. రాత్రి 4 గంటలకు రైలు దిగా. బయటకు రాగానే ఆటో, రిక్షాలు కనిపించాయి. నేరుగా రిక్షా వైపుకెళ్లి నేను వెళ్లాల్సిన అడ్రస్ చెప్పా. కొంతదూరం వెళ్లాక రిక్షావాలాను దిగమని, నేను ఎక్కి రిక్షా తొక్కా. అలవాటు తప్పిందా లేదా అని పరీక్షించుకున్నా. రిక్షా ప్రయాణం సవ్యంగానే సాగింది. తెల్ల దుస్తులతో రిక్షా తొక్కుతుంటే అతను ఆశ్చర్యపోయాడు. గతం చెప్పాక అతని ఆశ్చర్యానికి సమాధానం దొరికింది.

పరుచూరి ప్రోత్సాహంతో సినిమాల్లోకి..

యుక్త వయసులో సాంఘిక నాటికలు విస్తృతంగా వేసేవాళ్లం. కలియుగమా కళ్లుతెరువు, నీతీ నీవెక్కడ, గుండెలు మార్చబడును, ఏక్‌దిన్‌కా సుల్తాన్, పూల రంగడు.. ఇలా ఎన్నో నాటికల్లో కీలక పాత్రలు నావే. 'హుష్‌కాకి' అనే నాటికలో లచ్చిగాడు అనే బిక్షగాడు పాత్ర వేశా. ఆ రోజు సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా వచ్చారు. నాటికలోని నాపాత్ర చూసి అభినందించి, సినీ పరిశ్రమకు రమ్మన్నారు. తొలి సినిమా అవకాశం.. డాక్టర్ భవాని చిత్రంలో. నటుడిగా ఉంటూనే ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా, మేనేజర్‌గా, కంట్రోలర్‌గానూ చేసేవాడిని. జంబలకిడిపంబ, ఇద్దరు పెళ్లాల ముద్దుల పోలీస్, ఒరేయ్ రిక్షా, ఒసేయ్ రాములమ్మ, టాప్‌హీరో, ఆ.ఒక్కటీ అడక్కు...ఇలా వంద సినిమాలకు పైగా ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేశా. దర్శకరత్న దాసరి నారాయణ రావు దగ్గర శిష్యుడిగా ఉండే అవకాశం కొంతకాలం వచ్చింది. తిరుపతి అమ్మాయిని పెళ్లి చేసుకోవడంతో తిరుపతికి వచ్చేశా. ఆ సమయంలోనే గురువు దివంగత డాక్టర్ ఎస్.శివప్రసాద్‌తో సాన్నిహిత్యం ఏర్పడింది. ఆయన దగ్గర పనిచేసే అవకాశం వచ్చింది.

అభినయ ఆర్ట్స్ ప్రస్థానం

సినిమా పరిశ్రమ హైదరాబాద్‌కు మారిన తర్వాత అక్కడ ఇమడలేక తిరుపతికి తిరిగి వచ్చేసి అభినయ ఆర్ట్స్‌ను స్థాపించా. ఒక రోజు కార్యక్రమాలతో మొదలుపెట్టి.. నేడు 9 రోజులపాటు జాతీయ స్థాయి నాటకోత్సవాలను నిర్వహించే దాకా ఎదిగింది. రూ.14వేలతో మొదలుపెట్టిన కార్యక్రమం నేడు పాతిక లక్షలకు చేరింది. ఇదంతా నా వెన్నంటి ఉండే చిరకాల దాతలు, మిత్రుల సహకారం. ముఖ్యంగా నాభార్య యమున.. అతిథులు, కళాకారులకు కడుపునిండా అన్నంపెట్టి పంపుతుంది. కుటుంబ సభ్యులందరూ పనులన్నీ పక్కనపెట్టి పదిరోజుల పాటు మహతిలో కష్టపడతారు. ఆరునెలల పాటు అభినయ ఆర్ట్స్ పనిలోనే ఉంటా.



రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డు అందుకుంటున్న బీఎన్ రెడ్డి



గరుడ నాటకోత్సవాలలో ఉత్తమ హాస్యనటుడిగా నూతన ప్రసాద్ చేతుల మీదుగా అవార్డు

నంది అవార్డు

అభినయ ఆర్ట్స్ స్థాపించాక వేషాలు వేయడం తగ్గిపోయింది. గరుడ నాటకోత్సవంలో శ్రీకృష్ణతులాభారంలో వసంతకుడిగా నటించి ఉత్తమ హాస్యనటుడి అవార్డు దక్కించుకున్నా. రాష్ట్ర ప్రభుత్వ నంది నాటకోత్సవాలలో విరాట్ పాండవీయంలో ఉత్తర కుమారుడు పాత్రకు బంగారు నంది అందుకున్నా. ఏపీ పోలీస్ శాఖ కోసం ఎర్రచందనం అక్రమ రవాణాను నిరోధించడంపై 'మనసంపద' పేరుతో షార్ట్‌ఫిల్మ్ తీశా. ఇందులో విలన్ పాత్ర చేశా.

భూ సమస్యలకు పరిష్కారమెప్పుడు?

● రెవెన్యూ శాఖకు పోటెత్తుతున్న అర్జీలు ● కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 329 వినతులు





అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీశుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 21(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు భూ సమస్యలు పట్టించుకోవడంలేదంటూ జిల్లాలోని పలు మండలాల నుంచి వచ్చిన అర్జీదారులు జిల్లా అధికారుల వద్ద ఏకరువు పెట్టారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. వచ్చిన వినతుల్లో 80 శాతం రెవెన్యూ శాఖపైనే అందడం గమనార్హం. కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోష్మాండ్, ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 329 ఫిర్యాదులు అందగా అందులో 165 రెవెన్యూ శాఖకే రావడం గమనార్హం.

నడవలేని స్థితిలో ఉన్నా పింఛను మంజూరు చేయండి

సార్! మాది పుత్తూరు ఎన్జీవో కాలనీ. కూలి పనులు చేసుకుంటే కానీ కుటుంబం గడవదు. నా భర్త మరణించాడు. పిల్లలు కూడా ఎవరూ లేరు. అనారోగ్యం కారణంగా ఒక కాలు తొలగించారు. నడవలేని స్థితిలో ఉన్నాను. జీవితం గడవడం చాలా కష్టంగా ఉంది. వికలత్వ పింఛను ఇచ్చి ఆదుకోండి.

- జ్ఞానమ్మ, పుత్తూరు



భూమిని కబ్జా చేశారు.. న్యాయం చేయండి



అయ్యా... నాకు పసుపు, కుంకుమ కింద వచ్చిన భూమిని, నా తమ్ముడికి చెందిన భూమిని కేశవరావు అనే వ్యక్తి ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్నాడు. భూమిలోకి అడుగుపెట్టనివ్వడంలేదు. ఇప్పటికే పలుమార్లు అర్జీ ఇచ్చాం. మా సమస్యను పరిష్కరించలేదు. తహసీల్దారు వచ్చి చూశారే తప్పా న్యాయం చేయలేదు. మా వద్ద ఉన్న డాక్యుమెంట్స్ చూసి స్థలాన్ని ఇప్పించి న్యాయం చేయండి.

- బత్తెమ్మ, పాంచాలినగర్, రేణిగుంట

చిరు వ్యాపారులకు స్థలం కేటాయించండి



'జాతీయ రహదారి విస్తరణలో భాగంగా వీధి వ్యాపారులను ఖాళీ చేయమంటున్నారు.. వ్యాపారం చేసుకోవడానికి ప్రభుత్వ భూమిని కేటాయించండి' అంటూ తడ మండలం తడ కండ్రిగ గ్రామ పంచాయతీ వారు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు విన్నవించారు.

మా గుడి మాకు కట్టించండి

'దామినేడు గ్రామదేవత నాగాలమ్మ పుట్ట ఉన్న ఆలయ పరిసరాలను కృష్ణమూర్తినాయుడు గత నెల 15న అర్ధరాత్రి కూల్చివేశాడు. దీనిపై తాము ఆందోళన చేయగా సాక్షాత్తు ఆర్డీవో రామ్మోహన్, అధికార పార్టీ నాయకులు ఎదుట సదరు కృష్ణమూర్తినాయుడు, అతని కుమారుడు పద్మాకర్ తిరిగి కట్టిస్తామని చెప్పారు. నెల కావస్తున్నా ఇంతవరకు పట్టించుకోలేదు.' అంటూ కలెక్టరేట్‌లో అధికారులను దామినేడు వాసులు నిలదీశారు. న్యాయం చేయాలని ప్రాధేయపడ్డారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న దామినేడు వాసులు

మాల వాడిపోయింది గోవిందా..





మే నెలలో ధరింపజేసిన మాలలు

వాడిన మాలలతో ఆంజనేయస్వామి విగ్రహం

అలిపిరి కాలినడకమార్గంలో ఏడోమైలు వద్ద ఉండే ప్రసన్న ఆంజనేయస్వామి నిలువెత్తు విగ్రహం వాడిన పూలమాలతో దర్శనమిస్తోంది. హనుమజ్జయంతి సందర్భంగా గత మే నెలలో ప్రసన్న ఆంజనేయస్వామికి భారీ పుష్ప, ఆకుమాలలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఆ తర్వాత వాటిని తొలగించలేదు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో

ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్లు జైలుశిక్ష

● రూ.మూడు లక్షల చొప్పున జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జూలై 21(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.మూడు లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన మునియప్ప, మంజునాథ్ కొన్నేళ్లుగా శేషాచలం అడవుల్లోకి ప్రవేశించి ఎర్రచందనం చెట్లు నరికి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు అక్రమ రవాణా చేస్తున్నారు. 2018లో శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా చేయడానికి ప్రయత్నిస్తుండగా పీలేరు అటవీశాఖ సెక్షన్ అధికారి ఎన్.చిన్నబాబు పట్టుకుని ఫారెస్టు కార్యాలయానికి తీసుకొచ్చారు. విచారించగా వాస్తవాలు అంగీకరించడంతో వారిపై కేసు నమోదు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి విచారణ దశలో ఉన్న ఈ కేసు తిరుపతి ఎర్రచందనం ప్రత్యేక న్యాయస్థానానికి వచ్చింది. ఈ కేసుకు సంబంధించి లైజన్ అధికారి బాబుప్రసాద్, ఏపీపీ బాలకృష్ణమ నాయుడు, ఎఫ్ఆర్వో ఖ్యాతి, కోర్టు కానిస్టేబుల్ కృష్ణమూర్తి సాక్షాధారాలను కోర్టులో సమర్పించారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నరసింహమూర్తి నిందితులకు ఈ మేరకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

లింక్ ఓపెన్ చేస్తే రూ.50వేలు మాయం

నాయుడుపేట టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అత్తలపాళెం గ్రామానికి చెందిన ఓ యువకుడి సెల్‌ఫోన్‌కు ప్రైజ్ వచ్చిందంటూ మెసేజ్ వచ్చింది. అందులోని లింక్ ఓపెన్ చేసి తన వివరాలను నమోదు చేశాడు. అంతే క్షణాల్లో అతని బ్యాంక్ ఖాతాలోని రూ.50వేల నగదు మాయమైంది. దీంతో బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

బాధితులకు సత్వర న్యాయం : ఎస్పీ

● పోలీసు పీజీఆర్ఎస్‌కు 90 ఫిర్యాదులు



బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ హర్షవర్ధన రాజు

తిరుపతి(నేరవిభాగం), జూలై 21(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చే సమస్యలను సత్వరం పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పోలీసు పీజీఆర్ఎస్‌కు 90 వినతులు వచ్చాయి. ఏడు కౌంటర్ల ద్వారా వినతులు స్వీకరించారు. బాధితుల సమస్యలను సావధానంగా విన్న ఎస్పీ కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని ఆయా స్టేషన్లకు పంపారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, ఎస్పీ డీఎస్పీ వెంకటనారాయణ, సీఐలు సాదిక్ ఆలీ, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.11కోట్లతో గిరిజన విద్యాసంస్థల అభివృద్ధి

- మంత్రి గుమ్మడి సంధ్యారాణి -

తిరుపతి, జూలై21(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గిరిజన విద్యా సంస్థలు, హాస్టల్స్, శిశుసంక్షేమ కేంద్రాల అభివృద్ధికి అనేక నిధులు మంజూరయ్యాయని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. సోమవారం తిరుపతి పద్మావతి అతిథిగృహంలో ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ తిరుపతిలోని బాలికల హాస్టల్, స్టాఫ్ క్వార్టర్స్ కొత్త భవనాల కోసం రూ.352లక్షలు, అదనపు సిబ్బంది నివాసాల నిర్మాణం కోసం రూ.180 లక్షలు, బీఎన్‌కండ్రిగ, శ్రీకాళహస్తి బాలుర వసతి గృహాల కోసం రూ.420లక్షలు, సీఎస్ఆర్ నిధుల ద్వారా 23 సంస్థలకు కలిపి రూ.176లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ పనులు పూర్తవ్వడం ద్వారా జిల్లాలోని గిరిజన విద్యాసంస్థలు, హాస్టల్స్, శిశు సంక్షేమ కేంద్రాలకు మౌలిక సదుపాయాలు మెరుగవుతాయని తెలిపారు. ప్రతి చిన్నారికీ పోషకాహారం,విద్య, ఆరోగ్యం చేరాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తున్నట్లు చెప్పారు.కాగా తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ పలు స్థానిక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.



మంత్రికి సమస్యలు విన్నవిస్తున్న సుగుణమ్మ తదితరులు

చిత్తూరు డీసీసీబీకి నాబార్డు ప్రశంస

నగరి/చిత్తూరు కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): గడువుకు ముందే సింగిల్ విండోల కంప్యూటరీకరణ పూర్తి చేయడంతో పాటు జిల్లా రైతాంగానికి సహకార రంగం ద్వారా రుణాలు, అడ్వాన్సులు తదితర అంశాలలో ప్రతిభ కనబరిచిన చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)కు విశిష్ట గౌరవం లభించింది.నాబార్డు 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని నాబార్డు ప్రాంతీయకార్యాలయంలో సోమవారం రాష్ట్రస్థాయి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచిన చిత్తూరు, కృష్ణా, నెల్లూరు డీసీసీబీల అధికారులకు మెమొంటోలను అందజేశారు.సహకార శాఖ కమిషనర్ అహ్మద్‌బాబు చేతుల మీదుగా చిత్తూరు డీసీసీబీ సీఈవో శంకర్‌బాబు మెమొంటోను స్వీకరించారు.రాష్ట్రస్థాయిలో నాలుగు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(సింగిల్‌విండో) ఉత్తమ పనితీరు కనబరిచినట్లు నాబార్డు గుర్తించి సన్మానించింది.చిత్తూరు జిల్లాకు సంబంధించి నిబంధనలు పాటించి బ్యాంకును ఉన్నతస్థాయికి తీసుకెళ్లడమే గాక అన్ని రకాల రుణాలను రైతులకు అందించినందుకు నగరి సింగిల్ విండో తరఫున సీఈవో తులసిపిళ్లై, చైర్మన్ బాలాజీ, డైరెక్టర్ జవహర్‌రెడ్డి మెమొంటో అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు చీఫ్ మేనేజర్ గోపాల్, ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ బషీర్, ఆబ్కాబ్ ఎండీ శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





మెమెంటో అందుకుంటున్న డీసీసీబీ సీఈవో శంకర బాబు, నగరి పీఏసీఎస్ సీఈవో తులసి

9మంది స్మగ్లర్ల అరెస్టు

● 16 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

మంగళం, జూలై 21(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా బాలపల్లి ఫారెస్టు రేంజ్‌లో సోమవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు 9 మంది స్మగ్లర్లను అరెస్టు చేసి, 16 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఏఆర్ ఎస్ఐ బాలచెన్నయ్య బృందం స్థానిక ఎఫ్‌బీవో సుబ్బలక్ష్మితో కలిసి బాలపల్లి రేంజ్ అటవీప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు.ఆ ప్రాంతంలో కొందరు వ్యక్తులు రెండు కార్లతో టాస్క్‌ఫోర్సు పోలీసుల కంటపడటంతో వారిని చుట్టుముట్టగా పారిపోయే ప్రయత్నం చేశారు. అయితే టాస్క్‌ఫోర్సు పోలీసులు 9మందిని పట్టుకోగలిగారు. పట్టుబడిన వారు నంద్యాల, అన్నమయ్య జిల్లా, కర్ణాటకకు చెందిన వారిగా గుర్తించారు. వాహనంలోలోడ్ చేసిన 16 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లను వాహనాలతో సహా ఎర్రచందనాన్ని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పట్టుబడ్డ స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

3 గంటలు ఆలస్యంగా నడిచిన

ఇండిగో విమానం

అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రయాణికులు

రేణిగుంట జూలై 21:(ఆంధ్రజ్యోతి) : ఇండిగో విమానం సోమవారం మూడు గంటలు ఆలస్యంగా నడవడంపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. బెంగళూరు నుంచి తిరుపతి విమానాశ్రయానికి .మధ్యాహ్నం 2.35కు వచ్చి తిరిగి హైదరాబాదుకు 2.55గంటలకు పోవాల్సిన విమానం సాంకేతిక కారణాలతో సాయంత్రం 5.05 గంటలకు వచ్చి 5.35 గంటలకు హైదరాబాదుకు వెళ్లింది. దీంతో టిక్కెట్లు బుక్ చేసుకున్న 40 మంది ప్రయాణికులు మూడు గంటలు విమానాశ్రయంలో పడిగాపులు కాశారు. ఇండిగో యాజమాన్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

వంతెన ప్రారంభం



వంతెన ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొగళ్ల గుంట వద్ద శ్రీశ్రీనివాస ట్రస్టు(టీవీఎస్ సంస్థ) రూ.48లక్షలతో నిర్మించిన వంతెనను కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్నవారు పేదల ప్రజల జీవనోపాధి కోసం కృషి చేయాలన్నారు. వెనకబడిన పేదలను దత్తత తీసుకుని జీవనోపాధి కల్పించే విధంగా ముందుకు రావాలన్నారు. టీవీఎస్ సంస్థ మండలంలో గిరిజనల కోసం చేస్తున్న అభివృద్ధి పనులు అభినందనీయమమని కొనియాడారు. ఇప్పటి వరకు 60గ్రామాల్లో రూ.10కోట్లపైగా అభివృద్ధి పనులు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీవీఎస్ సంస్థ చైర్మన్ స్వర్ణసింగ్, క్లస్టర్ ఇన్‌ఛార్జి జయసింగ్, తహసీల్దార్ నరసింహరావు, ఎంపీపీ తనూజా తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు: విజయశ్రీ



ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారథి దంపతులను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ శ్రేణులు

నాయుడుపేట టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకుంటున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం స్థానిక నాయకులతో కలసి నాయుడుపేట మండలంలోని వేమిగుంటపాళెం, అన్నమేడు, మర్లపల్లి, కాపులూరు, కూచివాడ, చిలమత్తూరు పంచాయతీల్లో పర్యటించారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, చేస్తున్న అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పార్థసారథి, కామిరెడ్డి అశోక్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీరాంప్రసాద్, మాజీ ఎంపీపీ కన్నెమ్మ, సుజాత, చక్రపాణి, చెంచయ్య, బాబురెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్‌కు ప్రత్యామ్నాయ స్థలం చూపండి

సూళ్లూరుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): శ్రీహరికోట రోడ్డులో డీవీఎస్ కాలనీ సమీపంలో ఉన్న చేపల మార్కెట్‌కు ప్రత్యామ్నాయంగా స్థలం చూపించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యకు సీపీఐ ఆధ్వర్యంలో చేపల విక్రయదారులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు ఆనంద్ మాట్లాడుతూ చేపల మార్కెట్‌ను ఖాళీ చేయాలని షార్ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ప్రత్యామ్నాయంగా అదే రోడ్డులో సాయిబాబు ఆలయం నుంచి హోలీక్రాస్ సర్కిల్ వరకు ఎక్కడైన స్థలం చూపించాలని కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో అశోక్, లక్ష్మి, అముద తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ పూర్తి చేసేలా చర్యలు తీసుకోండి

గూడూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ గూడూరు ఒకటో, రెండో పట్టణాలకు రాకపోకలు సాగించేందుకు వీలుగా చేపట్టిన ఫ్లైఓవర్ నిర్మాణం గత 13 ఏళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు. దీంతో పట్టణ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని, వంతెనను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సుబ్బరామరాజు, బ్రహ్మయ్య, వేమయ్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

నాయుడుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనాలు పెంచాలంటూ సోమవారం మున్సిపల్ పారిశుధ్య కార్మికులు నాయుడుపేట పురవీధుల్లో అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ పెరిగిన నిత్యవర సరుకులు, జీవన ప్రమాణాలకు అనుగుణంగా కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే మున్సిపల్ కార్మికులకు రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. మున్సిపల్ కార్మికులకు అంగన్‌వాడీ కార్మికులు సంఘీభావాన్ని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి శివకవి ముకుంద, లక్ష్మి, శ్యామలమ్మ, శ్రీనివాసులు, నాగరాజు, రామచంద్రయ్య, వీరాస్వామి, రమేష్, కాలేషా, సురేష్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సూళ్లూరుపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేసే ఇంజినీరింగ్ కార్మికులు, పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కరించాలంటూ చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కార్మికుల సమ్మెకు అంగన్వాడీ వర్కర్స్ అండ్ యూనియన్ నాయకురాలు హైమావతి, సీఐటీయూ నాయకులు సాంబశివయ్య, లక్ష్మయ్య, అక్బర్ మద్దతు తెలిపారు.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలి

గూడూరు అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు కోరారు. సోమవారం గూడూరు పర్యటకు విచ్చేన ఆర్‌అండ్‌బీ మంత్రి జనార్దనరెడ్డికి సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. గూడూరును తిరుపతి జిల్లాలో కలపడంతో జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే వ్యయప్రయాసలు పడాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, శశికుమార్, రమేష్, సీవీఆర్ కుమార్, సునీల్, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన

సూళ్లూరుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉగ్గుముడి గ్రామంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు టీబీ వ్యాధిపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పేర్నాడు పీహెచ్‌సీ వైద్యుడు ఇలకా రమణయ్య మాట్లాడుతూ టీబీ వ్యాధి పూర్తిస్థాయి నివారణకు ప్రభుత్వం ప్రత్యేకంగా కార్యక్రమాలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తోందన్నారు. బరువు తగ్గడం, తగ్గు, జ్వరం, గొంతు భాగంలో గడ్డలు ఉంటే ప్రభుత్వ వైద్యశాలలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం నెలకి రూ.1000 పోషకాహారం కోసం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ బాల, హెల్త్ సూపర్‌వైజర్ కిరణ్, ఏఎన్ఎం, ఆశాలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 6వ వార్డులో 'సుపరిపాలనలో తొలి అడుగు'

వెంకటగిరి టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ 6వ వార్డులో మంగళవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ పట్టణాధ్యక్షుడు గంగాధర్ తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వార్డులో పర్యటిస్తారని, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పీఏసీఎస్ అధ్యక్షుడిగా రాజశేఖరరెడ్డి బాధ్యతల స్వీకరణ

చిల్లకూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పగుంటపాళెం పీఏసీఎస్ అధ్యక్షుడిగా దువ్వూరు రాజశేఖరరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో రాజనేని రామయ్యనాయుడు, నెల్లటూరు చిరంజీవి, శ్రీనివాసులు, కోటయ్య, కుమార్, సతీష్‌రెడ్డి, ప్రభాకర్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి వినతి

కోట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కోటలో అసంపూర్తిగా ఉన్న రోడ్లను పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ మంత్రి జనార్దరెడ్డిని మాజీ ఎంపీపీ నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి తెలిపారు.



టెంకాయతోపు గ్రామంలో అంతర్గత రోడ్లపై చేరిన వర్షపునీరు

బయటకు వచ్చేదెలా!

- జలదిగ్బంధంలో టెంకాయతోపు
- వర్షం వచ్చిన ప్రతిసారీ ఇదే పరిస్థితి
- నీళ్లు బయటకు పోయేందుకు మార్గం లేక ఇబ్బందులు

పెళ్లకూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అదో చిన్న కుగ్రామం.. ఓ పక్క జాతీయ రహదారి.. మరో పక్క పంటపొలాలు.. చినుకుపడితే గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకోవాల్సిందే. వర్షపు నీరు వెలుపలకు వెళ్లే మార్గంలేక ప్రజలు ఇళ్లలో నుంచి బయట అడుగుపెట్టలేని ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని నెలబల్లి పంచాయతీ పరిధిలోని టెంకాయతోపు గ్రామం నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారికి పక్కనే ఉంది. ఇక్కడ నూతనంగా నిర్మించిన జాతీయ రహదారిలో భాగంగా ఫ్లైఓవర్ నిర్మించారు. దీంతో జాతీయ రహదారి ఎత్తు పెరిగి గ్రామం లోతులో ఉండడంతో వర్షం వచ్చిన ప్రతిసారి నీళ్లు బయటకు వెళ్లే పరిస్థితి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో గ్రామంలోని అంతర్గత రోడ్లపై నీరు నిలిచిపోయి కుంటలను తలపిస్తున్నాయి. అడుగుతీసి అడుగు వేయాలంటే జనం భయభ్రాంతులకు గురవుతున్నారు. బయట వెళ్లలేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చొరవ చూపి సమస్య పరిష్కరించాలని టెంకాయతోపు గ్రామస్తులు కోరుతున్నారు.

హామీలను నెరవేర్చే సమర్థుడు చంద్రబాబే

మంత్రి జనార్దనరెడ్డి



కరపత్రాలు అందజేసి సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి జనార్దనరెడ్డి, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను నెరవేర్చే సమర్థత సీఎం చంద్రబాబు నాయుడుకే ఉందని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి జనార్దనరెడ్డి అన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని జనార్దనరెడ్డి కాలనీలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అరాచకపాలన వల్ల రాష్ట్రం అధోగతిపాలైందన్నారు. ఎంతో మంది పారిశ్రామిక వేత్తలు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లారన్నారు. వైసీపీ నాయకులు మద్యం కుంభకోణానికి పాల్పడి వేల కోట్ల రూపాయలను లూటీ చేశారని, అక్రమ మైనింగ్‌తో సహజ సంపదను దోచుకున్నారన్నారు. వైసీపీ అరాచక పాలనను తట్టుకోలేని ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా వారిలో మార్పు రాలేదన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎన్డీఏ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వీటిని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ఫ్లైఓవర్, పంబలేరు బ్రిడ్జి నిర్మాణాలను ఆర్‌అండ్‌బీ మంత్రి సహకారంతో సీఎం దృష్టికి తీసుకువెళ్లి పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం పంబలేరు బ్రిడ్జిని మంత్రి, ఎమ్మెల్యే పరిశీలించి సంబంధిత శాఖ అధికారులతో చర్చించి వంతెన పూర్తయ్యేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా గత ప్రభుత్వం అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.9కోట్లు అవసరమవుతాయని, సీఎం దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తానంకి నానాజీ, శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీం, చంద్రమౌళి, మట్టం శ్రావణి, అల్లూరు కరుణాకర్‌రెడ్డి, లీలావతి, చంద్రనీల్, మోహన్ నటశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి జనార్దనరెడ్డికి స్వాగతం

చిల్లకూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): గూడూరులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి జనార్దనరెడ్డికి సోమవారం చిల్లకూరులోని జాతీయ రహదారిపై ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, తానంకి నానాజీ, నాయకులు ఘన స్వాగతం పలికారు. కూటమి నాయకులు, కార్యకర్తలు మంత్రిని, ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌ను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, నెల్లటూరు చిరంజీవి, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, పద్మజ, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కీరవాణి, మునిశేఖర్‌గౌడ్, సతీష్ యాదవ్, శివకుమార్, నరసింహులు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

చిట్టమూరు, జులై 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిట్టమూరులో సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ప్రారంభించారు. స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజు పర్యవేక్షణలో క్యాన్సర్ లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ఆరోగ్యశాఖ సహకారంతో రెండు పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ, వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో చిట్టమూరు వైద్యాధికారి పద్మావతి, సిమ్స్ వైద్యులు సుఖేంద్ర, మెడికల్ ఆఫీసర్ చైతన్య భాను, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది బాబూరావు, హైమావతి, నాగేశ్వరరావు, దేవి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

సూళ్లూరుపేట, నాయుడుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది డిసెంబరులో వరదల తాకిడికి పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద రైతులు నిరసన తెలిపారు. ఆర్డీవో కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి పాదర్తి రాజారెడ్డి, నాయకులు శశికిరణ్, ప్రసాద్, మదనంబేటి శ్రీనివాసులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి వినతిపత్రం అందజేశారు. తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, ప్రసాద్, వెంకటాచలం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష

కోట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సంక్షేమ పథకాల అమలుపై ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, డిప్యూటీ ఎంపీడీవో వేణు సమీక్ష నిర్వహించారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

వాకాడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరెడ్డిపాళెం గ్రామంలో వెలసిన గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. ప్రవాస భారతీయులు రామిరెడ్డి వెంకటరామరెడ్డి, హైమావతమ్మ, లావణ్య, మధుకిరణ్‌రెడ్డి కుటుంబసభ్యుల దాతృత్వంతో కల్యాణ మహోత్సవాన్ని పురోహితులు జరిపించారు. కార్యక్రమంలో జిల్లా అర్చక మండలి సభ్యులు దివి అనంతాచార్యులు, నరేష్‌శర్మ, ఆలయ నిర్వాహకులు చిన్నయ్య, సులాభాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్‌శాఖ సిబ్బందికి శిక్షణ

తడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులో వాహన తనిఖీలపై ఎక్సైజ్‌శాఖ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. గూడూరు ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ఊహశ్రీ ఆధ్వర్యంలో సుమారు 103 మంది అధికారులు, ఉద్యోగులు సోమవారం భీములవారిపాళెం చెక్‌పోస్టులో వాహన తనిఖీలకు తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చారు. చెన్నై వైపు వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో చెక్‌పోస్టు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్‌శాఖ సిబ్బంది

ఆదర్శంగా గిరిజన గురుకులాలు



చిట్టేడు గిరిజన గురుకులాన్ని పరిశీలిస్తున్న ఏపీటీ, ఏఎంవోలు

కోట, జూలై 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సహకారంతో గిరిజన గురుకులాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని సమగ్రశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ గౌరీశంకర్‌రావు, ఏఎంవో శివశంకర్ అన్నారు. కోట మండలం చిట్టేడులోని యానాదుల గురుకుల కళాశాలను సోమవారం తనిఖీ చేశారు. కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో కొనసాగే సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో మస్తానయ్య, ప్రిన్సిపాల్ శుభకర్‌రావు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించండి

కోట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్న తమపై పనిభారం తగ్గించకపోతే ఉద్యమిస్తామని అంగన్‌వాడీ వర్కర్లు హెచ్చరించారు. సోమవారం కోటలోని స్త్రీశిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్‌వాడీ వర్కర్లు పనిభారం తగ్గించాలంటూ నిరసన తెలిపారు. అనంతరం సీడీపీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకురాలు పద్మలీల, విజయమ్మ, కోటేశ్వరి పాల్గొన్నారు.

యాప్‌లను రద్దు చేయాలి

గూడూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లలో యాప్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు అన్నారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఇంద్రావతి, ఆసియా, భారతమ్మ, పెంచలమ్మ, రోజా, అలేఖ్య, శివకుమార్, బీవీ.రమణయ్య, ప్రసాద్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించండి

వెంకటగిరి, జులై 21 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రోత్సహించాలని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవనాయుడు అన్నారు. సోమవారం మొగళ్లగుంట పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆయన కలిశారు. వచ్చే నెలలో ఈజీప్టులో జరిగే అంతర్జాతీయ గోల్‌బాల్ క్రీడా పోటీలకు ఎంపికైన వెంకటగిరికి చెందిన బ్లైండ్ క్రీడాకారుడు ముప్పాళ శేషగిరిని కలెక్టరు, ఎమ్మెల్యేకు పరిచయం చేశారు. ఇలాంటి క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహిస్తే రాణిస్తారని అన్నారు. బ్లైండ్ క్రీడాకారులకు అండగా నిలుస్తున్న రాష్ట్ర బ్లైండ్స్ అసోషియేషన్ అధ్యక్షులు పచ్చూరు నరసయ్య నాయుడును మాధవనాయుడు అభినందించారు.

చెరువు వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు

చిట్టమూరు, జులై 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యాకసిరి పాడేరు చెరువు సమీపంలో సోమవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. యాకసిరి రెవెన్యూ పరిధిలోని 425 సర్వే నెంబర్‌లో గ్రావెల్ తవ్వకాలను ఆపివేస్తూ హైకోర్టు ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో యాకసిరి పాడేరు చెరువు సమీపంలో నుంచి ఎవరూ గ్రావెల్ తరలించరాదని తహసీల్దార్ సతీష్ కుమార్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆయన వెంట రీ సర్వే డీటీ నిరంజన్ కుమార్, డీటీ నరేష్, మండల సర్వేయర్ వెంకటేష్ ఉన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలి

సూళ్లూరుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే ఆపాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ ఒప్పందంతోనే స్మార్ట్ మీటర్లు అమర్చుతున్నారని విమర్శించారు. అనంతరం విద్యుత్ శాఖ పట్టణ ఏఈ మోహినికి వినతిపత్రం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో శ్రీసిటీ ఉద్యోగి మృతి

సూళ్లూరుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం కుదిరి వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీసిటీ కొబెల్కో కంపెనీలో పనిచేస్తున్న కొల్లూరు వంశీ(25) మృతి చెందాడు. పోలీసులు సమాచారం మేరకు... బాపట్ల జిల్లా పల్లూరు గ్రామానికి చెందిన వంశీ శ్రీసిటీ పారిశ్రామికవాడలోని గోబెల్కో పరిశ్రమలో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. సూళ్లూరుపేట షార్ వై జంక్షన్ సమీపంలో స్నేహితులతో కలిసి అద్దె గదిలో ఉంటున్నాడు. ఆదివారం సెలవు కావడంతో సాయంత్రం సరదాగా మోటరు సైకిల్‌పై శ్రీహరికోట మార్గంలో పులికాట్ సరస్సును వీక్షించేందుకు వెళ్లాడు. రాత్రి తిరిగి వచ్చే సమయంలో కుదిరి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో అక్కడికక్కడే వంశీ మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి బంధువులుకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన సుమతి

నాయుడుపేట టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజగోపాలపురంలో ఉంటున్న సుమతి (32) ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.... వెంకటాచలం మండలం గొలగమూడి గ్రామానికి చెందిన సుమతితో బాలయపల్లి మండలం కాట్రగుంట గ్రామానికి చెందిన మస్తానయ్యకు 2020లో వివాహం జరిగింది. సుమతి మేనకూరు సెజ్‌లో ఓ కర్మాగారంలో పనిచేస్తూ నాయుడుపేటలో నివాసం ఉంటోంది. ఈనెల 18వ తేదీ సుమతి భర్త కేరళకు బంధువులతో కలసి వెళ్లాడు. ఆదివారం మధ్యాహ్నం భర్తకు ఫోన్‌చేసి తక్షణమే నాయుడు పేటకు బయలుదేరి రావాలని కోరింది. లేకుంటే ఇదే చివరి కాల్ అని మెసేజ్ పంపింది. అనంతరం తన గదిలో ఉరివేసుకొని సుమతి మృతి చెందింది. మస్తానయ్య ఎన్నిసార్లు ఫోన్ చేసినా సుమతి తీయకపోవడంతో తన స్నేహితులకు ఫోన్‌చేసి నాయుడుపేటలో సుమతి ఇంటికి వెళ్లమని చెప్పాడు. మస్తానయ్య స్నేహితులు వెళ్లి కిటికీలో నుంచి చూడగా సుమతి ఉరివేసుకొని ఉన్నట్లు గుర్తించారు. అర్బన్ సీఐ బాబి సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్లో నుంచి పడి ఉత్తరప్రదేశ్ యువకుడి మృతి



తానికుమార్ (ఫైల్‌ఫొటో)

నాయుడుపేట టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం బిరదవాడ సమీపంలో ప్రమాదవశాత్తు రైల్లో నుంచి పడి ఉత్తరప్రదేశ్ యువకుడు తానికుమార్(19) మృతి చెందాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొంత మంది యువకులు కూలి పనుల నిమిత్తం కర్ణాటకకు రైల్లో బయలుదేరారు. బిరదవాడ సమీపంలో వెళ్తుండగా ద్వారం వద్ద నిలబడి ఉన్న తానికుమార్ ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. తోటి స్నేహితులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో మూడు పందుల మృతి

సూళ్లూరుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో వాకాటి నారాయణరెడ్డి నగర్ వద్ద రోడ్డు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సోమవారం విద్యుదాఘాతం జరగడంతో మూడు పందులు మృతి చెందాయి. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నీళ్లు నిలిచాయి. సోమవారం ఉదయం ట్రాన్స్‌ఫార్మర్ పక్కన చెత్తకుప్పలో ఆహారం కోసం వెళ్లిన పందులు విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి.

ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధం

నాయుడుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట బజారువీధిలో సోమవారం ఓ ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధమైంది. వెంకటేష్ బజారువీధిలోని తన దుకాణం ఎదుట స్కూటీని ఆపి ఉంచాడు. అకస్మాత్తుగా స్కూటీ లోని బ్యాటరీ నుంచి మంటలు వ్యాపించాయి. మంటలను ఆర్పేందుకు స్థానికులు ప్రయత్నించినా లాభం లేకపోయింది.

జర్మనీలో ఉద్యోగావకాశాలు

నర్సింగ్ కోర్సు చేసిన వారికి ఉచిత శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), జూలై 21(ఆంధ్రజ్యోతి): నర్సింగ్‌కోర్సులు పూర్తిచేసిన వారికి జర్మనీ వంటి దేశాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సాంఘిక సంక్షేమాధికారి విక్రమ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో తిరుపతి నగరంలో షెడ్యూల్‌కులాలకు చెందిన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం నర్సింగ్ పూర్తిచేసిన వారు అర్హులని, వారికి ఉచితంగా పది నెలలు జర్మనీ భాషపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 80083 59664, 87906 54826 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

పచ్చిరొట్టతో భూమికి జీవం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 21(ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట వాడకం ద్వారా ఎరువులు ఆదా అవడంతో పాటు భూమికి జీవం వస్తుందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ అధికారులతో కలిసి సోమవారం కలెక్టర్ పచ్చిరొట్టతో ఎరువుతో మట్టికి జీవం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షానికి ముందు జీవన ఎరువులు వినియోగిస్తే పదిశాతం రసాయన ఎరువులు ఆదా చేయవచ్చన్నారు. జిల్లాలోని రైతులందరూ పచ్చిరొట్ట ఎరువులను, జీవన ఎరువులను రైతు సేవా కేంద్రాల వద్ద రాయితీపై కొనుగోలు చేసి వినియోగించాలని సూచించారు. దీంతో పోషక విలువలు కలిగిన పంటలు పండించడమే కాకుండా పర్యావరణానికి మేలు చేసిన వారవుతారని అన్నారు.

పాఠశాల విలీనం వద్దు



నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

శ్రీకాళహస్తి, జూలై 21(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో ఉన్న పాఠశాలను విలీనం చేయవద్దని గ్రామస్థులు కోరుతున్నారు. సోమవారం శ్రీకాళహస్తి మండలం యార్లపూడి పంచాయతీ రాజుగుంట పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ పాఠశాల విలీనం పేరుతో తమ పిల్లలను మూడు కిలోమీటర్ల దూరంలో ఉండే మరో పాఠశాలకు పంపలేమన్నారు. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో, మధ్య లో కాలువ వర్షాకాలంలో ప్రమాదకరంగా ప్రవహిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో తమ పిల్లలను పంపలేమని తెలిపారు. అధికారులు స్పందించి పాఠశాలను విలీనం చేయవద్దని కోరారు.

వాలీబాల్ విజేత కొనేపల్లి



శ్రీకాళహస్తి, జూలై 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పురు షుల డిగ్రీ కళాశాల మైదానంలో రెండు రోజుల పాటు జరిగిన వాలీబాల్ టోర్నీ విజేతగా కొనేపల్లి జట్టు నిలిచింది. రన్నర్స్‌గా వి స్పోర్ట్స్ క్లబ్ నిలిచింది. సోమవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ విచ్చేసి విజేతకు ట్రోఫీతో పాటు రూ.20వేలు నగదు బహుమతి అందజేశారు. రన్నర్స్‌కు రూ.15వేలు అందజేశారు. 3, 4, 5, 6 స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.5వేలు చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



శ్రీకాళహస్తి, జూలై 21(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా ప్రత్యేక రాహుకేతు సర్పదోష పూజలను చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



శ్రీకాళహస్తి, జూలై 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్ర బాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా వేడాం పెద్ద మిట్టకండ్రిగ, వేడాం, వేడాం ఎస్టీకాలనీ, రామాపురం, రామలింగా పురం, సుబ్బానాయుడుకండ్రిగలో పర్యటించి ఇంటింటా సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభి వృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ కార్య క్రమంలో టీడీపీ మండ లాధ్యక్షుడు అక్కింతల కృష్ణయాదవ్, నాయకులు చెంచయ్య నాయుడు, బత్తిరెడ్డి, కామేష్‌యాదవ్, విజయలక్ష్మి, జగదీశ్వర్‌రెడ్డి, రమేష్, సుభాషిణి, అనూష, కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

రేణిగుంట జూలై 21:(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని డీఎస్పీ శ్రీనివాసరావు తెలియజేశారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని సూచించారు. ఎంఈవో ఇంద్రాదేవి, ఎస్ఐ అరుణ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు


అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమం



ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయమని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని చెర్లోపల్లిలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. ఇంటింటికి వెళ్లిన ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం కుంభకోణంలో నిన్న పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి జైలుకు వెళితే రేపు మాజీ ముఖ్యమంత్రి జగన్ జైలుకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. నదుల అనుసంధానంతో గాలేరు - నగరి ద్వారా రాయలసీమ ప్రాంతం సస్యశ్యామలం కానుందన్నారు. తల్లికి వందనం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. చెర్లోపల్లి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు సమస్యల వెల్లువ



ఇళ్ల పట్టాల కోసం అర్జీలు అందించిన గిరిజనులు

పుత్తూరు, జూలై21(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం తహసీల్దారు వెంకటేశ్వర్లుకు అర్జీలు వెల్లువెత్తాయి. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మున్సిపాలిటీ పరిధిలోని గంగమాంబాపురం ఎస్టీ కాలనీకి చెందిన దాదాపు 20 మంది ఇళ్ల పట్టాల కోసం ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఏలుమలై రెడ్డి, సీఎం నాయకుడు వెంకటేశుల ఆధ్వర్యంలో అర్జీలను అందించారు. నేసనూరు పంచాయతీ గట్టు గ్రామంలో మంచినీళ్ల గుంట స్థలం ఆక్రమణలకు గురి కావడంతో పొలాలకు వెళ్లే దారి మూసుకు పోయిందని ఆ గ్రామానికి చెందిన సుబ్రమణ్యం రాజు, జోగరాజు, శ్రీనివాసరాజు ఫిర్యాదు చేశారు. గొల్లపల్లి పంచాయతీలోని మిట్టపల్లూరుకు చెందిన భార్యాభర్తలు తమ పొలంలో గ్రామస్తులు దారిని వేస్తున్నారని సమస్య పరిష్కరించాలని విన్నవించారు. ఇంకా పలువురు వినతులు అందజేశారు. డీటీ అశోక్‌రెడ్డి, ఏఎస్ఓ మునికృష్ణయ్య, మండల సర్వేఅధికారి శేషమరాజు, వీఆర్ఓలు, గ్రామసర్వేయర్లు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

పల్లికొండేశ్వరుడి ఆదాయం రూ.5,92,593

నాగలాపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండల పరిధిలోని సురుటుపల్లి పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. 5 లక్షలా 92 వేలా 593 రూపాయల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో లత తెలిపారు. ఈ ఆదాయం 54 రోజులకు సంబంధించి భక్తులు చెల్లించిన కానుకలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ, తిరుపతి డివిజన్ తనిఖీ దారులు పణిరాజశయన, కానిస్టేబుల్ హనీఫ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మృత్యుంజయ పూజలు

శ్రీకాళహస్తి, జూలై 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువైన మృత్యుంజయస్వామికి సోమవారం వేదోక్తంగా మృత్యుం జయ పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

28 నుంచి ఎల్లమ్మ జాతర

రేణిగుంట జూలై 21:(ఆంధ్రజ్యోతి): స్థానిక సంత గేటు వద్ద ఉన్న ఎల్లమ్మ తల్లి జాతర ఈనెల 28 నుంచి 30 తేదీ వరకు జరగనుంది. మంగళవారం సాయంత్రం చాటింపు వేయనున్నారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్త ఏలుమలై రెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రాస్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం

రేణిగుంట జూలై 21:(ఆంధ్రజ్యోతి) రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ద్వారా మండలంలోని ఆర్ అగ్రహారంలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో ఏరియా వెటర్నరీ డాక్టర్ స్రవంతి, ట్రస్టు సభ్యులు భూపతి, సుబ్బరత్నమ్మ, రాస్ సిబ్బంది గిరి ప్రసాద్, అన్ను, ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

సమాచార చట్టంపై అవగాహన సదస్సు

రేణిగుంట జూలై 21:(ఆంధ్రజ్యోతి) మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారి ప్రభురావు ఆధ్వర్యంలో స్పెషల్ ఫ్యాకల్టీ నాగరాజు అవగాహన కల్పించారు.

మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించండి

ఏర్పేడు, జూలై 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం విషయంలో నిర్వాహకులు అశ్రద్ధ చూపరాదని బొజ్జల బృందమ్మ పేర్కొచారు. ఏర్పేడు మండలంలోని పల్లం, పంగూరు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సోమవారం మధ్యాహ్న భోజనాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళా నేతలు సుమతి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

వరదయ్యపాళెం, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కువాకొల్లి పంచాయతీ లక్ష్మీపురంలో మస్తాన్‌కు చెందిన గేదెకు విద్యుత్‌స్తంభానికి ఉన్న తీగలు తగలి మృతి చెందింది. తనను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నాడు.

ఆలయాల్లో చోరీ

కేవీబీపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమలపూడి గ్రామంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు గంగమ్మ అమ్మవారి ఆలయాల్లో చోరీకి పాల్ప డ్డారు. అమ్మవారికి అలంకరించిన మూడు సవర్ల బంగారు చైను, హుండీలో ఉన్న నగదు దోచుకెళ్లారు. గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పిచ్చాటూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్యకర్తల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సీఐటీయూ ప్రాంతీయ కార్యదర్శి నాగరాజు అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి ఇంద్రాణి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం 26 వేలు చెల్లించాలని కోరారు. అనంతరం సీడీపీవోకి వినతిపత్రం సమర్పించారు. కృష్ణవేణి, భారతి, పూర్ణిమ, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో వేరుశనగకు తీవ్ర నష్టం





కాటూరు పొలాల్లో వర్షపు నీటిలో ఉన్న వేరుశెనగ, బీఎన్ కండ్రిగ ఆటస్థలంలో వేరుశనగను ఆరబెడుతున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 21 (ఆంధరజ్యోతి): మండలంలో ఆదివారం రాత్రి కురసిన వర్షంతో వేరుశనగ పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆరుకాలం కష్టించి పండించిన పంట వర్షానికి తడిచిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలో ఖరీఫ్‌లో విస్తారంగా వేరుశనగ పంటను రైతులు వేశారు. పంట ఒబ్బిళ్లు సాగుతున్న సమయంలో వర్షం కురిసింది. కాటూరు, నీర్పాకోట, పదవమ్మైలు, అరిగిలకండ్రిగ గ్రామాలలో రాత్రి కురిసిన వర్షానికి పెరిగిన వేరుశనగ పొలాల్లోనే ఉండిపోవడంతో నీరు చేరి పంట పనికి రాకుండా పోయింది. పలుచోట్ల తడిచిపోయిన కాయలను ఆరబెట్టేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు.

ఎర్రచందనం స్వాధీనం



ఏర్పేడు, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం పాయల్ సెంటర్‌లో ఐదు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. వారి కథనం మేరకు తిరుపతి అటవీశాఖాధికారికి అందిన రహస్య సమాచారం మేరకు పాయల్ సెంటర్ వద్ద ఆదివారం రాత్రి పాపానాయుడుపేట అటవీశాఖ సిబ్బంది, బేస్ క్యాంపు సిబ్బంది తనిఖీలు ప్రారంభించారు. సోమవారం తెల్లవారుజామున పొదలమాటున 157 కిలోల బరువుగల ఐదు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.1.33లక్షలు ఉంటుంది. ఈ తనిఖీల్లో తిరుపతి ఎఫ్ఆర్వో సుదర్శన్‌రెడ్డి, పాపానాయుడుపేట ఎఫ్ఎస్‌వో శంకరప్ప, చెల్లూరు బీట్ ఎఫ్ఎస్‌వో ముదియానాయక్, మునలిపేడు ఎఫ్‌బీవో జ్యోతి, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీకి ఘన స్వాగతం

రేణిగుంట జూలై 21:(ఆంధ్రజ్యోతి) సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ శంకర్‌రావుకు ఘన స్వాగతం లభించింది. సౌత్ కోస్ట్ రైల్వే మజ్దూర్ యూనియన్‌కు జనరల్ సెక్రటరీగా ఏక గ్రీవంగా ఎన్నిక కావడంతో శ్రీవారి దర్శనార్థం సోమవారం ఉదయం హైదరాబాదు నుంచి రైలులో రేణిగుంట రైల్వే స్టేషన్ చేరుకున్న ఆయనకు సీఆర్ఎస్ మజ్దూర్ యూనియన్ చైర్మన్ సదాశివరెడ్డి, సెక్రటరీ బాబు, ట్రెజరర్ మునికుమార్ స్వాగతం పలికారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మునిశేఖర్

కేవీబీపురం,జూలై 21(ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా బీజేపీ మాజీ మండల ఉపాధ్యక్షుడు మునిశేఖర్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన ఆదివారం పార్టీ అధ్య క్షుడి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. మండలంలోని బీజేపీ నాయకులు, పార్టీ అధ్యక్షుడు బాబుయాదవ్, జిల్లా నాయకుడు వెంకట కృష్ణయ్య ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలి

సత్యవేడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణిలు, బాలింతలు, చిన్న పిల్లలకు అందిస్తున్న టేక్‌హోమ్ రేషన్‌కి సంబంధించి లబ్ధిదారుల ముఖగుర్తింపు విధానం యాప్ (ఎఫ్ఆర్ఎస్)ను రద్దు చేయాలని స్థానిక ఐసీడీఎస్ కార్యాలం వద్ద ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఎంపీడీవో త్రివిక్రమరావుకు వినతి పత్రం అందించారు.

ఇళ్ల స్థలాల కోసం ధర్నా

సత్యవేడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని మండలంలోని కొత్తమారికుప్పం పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన గిరిజనులు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంబాక్కం చిన్నిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వ హించారు. కొత్తమారికుప్పం ఎస్టీ కాలనీ సమీపంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో ఇళ్ల పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

లిక్కర్ స్కాంలో శ్రీకాళహస్తి డాన్‌పై సిట్ దృష్టిపెట్టాలి: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీనాయకులు

శ్రీకాళహస్తి, జూలై 21(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో శ్రీకాళహస్తి డాన్‌పై సిట్ దృష్టి పెట్టాలని టీడీపీ రాష్ట్ర బీసీ విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు పేర్కొన్నారు. సోమవారం టీడీపీ నాయకులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం కుంభకోణంలో ఏ10గా ఉన్న ఎస్కే సైఫ్ అహ్మద్ శ్రీకాళహస్తికి చెందిన వ్యక్తి అన్నారు. అతడిని రాజ్ కసిరెడ్డికి పరిచయం చేసిన శ్రీకాళహస్తి డాన్ ఎవరు...? కుంభకోణంలో ఆయన పాత్ర ఏమిటి అనే విషయాలపై సిట్ దృష్టిపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు మునిరాజా యాదవ్, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, భీమాల భాస్కర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

పథకాలు అందకపోతే చెప్పండి : టీడీపీ



చెన్నంపల్లిలో పర్యటిస్తున్న టీడీపీ నాయకులు

ఏర్పేడు,జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు అందకపోతే చెప్పండి అందేలా చూస్తామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఏర్పేడు మండలం పెనగడం, చెన్నంపల్లి గ్రామాల్లో టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగరాజు నాయుడు, బాబునాయుడు, కృష్ణప్ప మొదలియార్, సీతాపతి ఆచారి, డాక్టర్ మునెయ్య, మనోహర్‌నాయుడు, సుందర్‌బాబు, ఏకాంబరం, రోశయ్య పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం: శంకర్‌రెడ్డి



గజమాలతో స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

నారాయణవనం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, పేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నారాయణవనంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, టీటీడీ బోర్డు సభ్యులు మంత్రి పనబాక లక్ష్మీ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హేమలతలతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో ఇంటింటా తిరుగుతూ సుపరిపాలన కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ తాను అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. నాయకులు గిరిబాబు, శ్రీనివాస్‌యాదవ్, యాచేంద్ర నాయుడు, సతీష్‌నాయుడు, పద్మనాభరాజు, తిరుమల రెడ్డి, మునివేలు పాల్గొన్నారు.

వైసీపీ తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ అక్రమం అంటూ వైసీపీ నాయకులు చేస్తున్న డ్రామాలు చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పేర్కొన్నారు.

బంగారు కుటుంబాలను సృష్టించడమే లక్ష్యం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాలను సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శి నెమల్లూరు బుజ్జి అన్నారు. పట్టణంలోని 22వ వార్డు పరిధిలోని తెలుగుగంగ కాలనీ సచివాలయంలో పీ-4 కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థిక అసమానతలు తగ్గించి పేదరిక నిర్మూలన కోసం కృషి చేస్తున్నార న్నారు. సచివలయ అడ్మిన్ సునీల్, సంక్షేమ కార్య దర్శి మునికృష్ణారెడ్డి, నాయకులు పూల శేఖర్, శంకరయ్య, బాలయ్య, సులేమాన్, తేజ, లోకేష్ పాల్గొన్నారు.

మినీ సైన్స్‌ల్యాబ్ ఏర్పాటు



వరదయ్యపాళెం, జూలై 21(ఆంధ్ర జ్యోతి): వరదయ్యపాళెం మండలం బత్తల వల్లం జడ్పీ ఉన్నత పాఠశాలలో శ్రీసిటీలోని బ్లూస్టార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.లక్ష వ్యయంతో మినీ సైన్స్ ల్యాబ్‌ను సోమ వారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు సరస్వతి, గున్నయ్య, ప్రధానో పాధ్యాయులు జయసుధ, బ్లూస్టార్ ఫౌండే షన్ యాజమాన్యం జీఎం నవీన్‌కుమార్, ప్లాంట్ హెడ్ స్టాలిన్, రాజశేఖర్, హెచ్‌ఆర్ ఏ రమాదేవి, సాయిదీప్తి, డిప్యూటీ మేనే జర్లు, పీఈటీ కుమార్, ఉపాధ్యాయులు ప్రభాకర్, పరంధామయ్య పాల్గొన్నారు.

ఎల్లంపల్లి గిరిజనుల భూములకు పట్టాలివ్వాలి

శ్రీకాళహస్తి, జూలై 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం ఎల్లంపల్లి గిరిజ నులు 23 సంవత్సరాలుగా సాగుచేసుకున్న భూ ములకు పట్టాలివ్వాలని, ఇంటిస్థలాలు, శ్మశానానికి స్థలం కేటాయిం చాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాయపనేని హరికృష్ణ కోరారు. సోమవారం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. తహసీల్దారు మాట్లాడుతూ సర్వే చేసి సమస్య పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఎల్లంపల్లి పోరాట కమిటీ అధ్యక్షుడు బత్తెయ్య, కార్యదర్శి చెంగల్రాయులు, పాల్గొన్నారు.

డ్రాపౌట్స్‌ను గుర్తించండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎస్ఎస్ఏ అకడమిక్ మానిటరింగ్ అధికారి శివ కుమార్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ స్కీం కింద నిర్మించిన కెమిస్ట్రీ ల్యాబ్, కిచెన్ గార్డెన్ ర్యాప్, ప్లేగ్రౌండ్, స్కూల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ వసతులను సోమవారం పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు.

పేదల కోసం నిరంతరం పని చేస్తా: ఆదిమూలం



విద్యార్థులతో కలసి మధ్నాహ్న భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

- కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం నిరంతరం పని చేస్తూ వారికి అండగా ఉంటానని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. సోమవారం మండలంలోని పార్లపల్లి, కాటూరు గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 13వేల బంగారు కుటుంబాలు ఎంపిక చేశామని దాతల ద్వారా ఆ కుటుంబాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని వివరించారు. స్త్రీనిధి ద్వారా మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి ప్రతి వీవోకు రూ. 70లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కాటూరు దళితవాడలో రూ. 10లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. పార్లపల్లి అంగన్వాడీలో గర్భిణులకు సీమంతాలు చేసి పౌష్టికాహారం అందజేశారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరత్నమ్మ, తహసీల్దార్ శ్రీదేవి, ఎంఈవో రవీంద్రనాథ్, ఎస్ఐ విశ్వనాథనాయుడు, స్త్రీనిధి మేనేజర్ వనజ, ఏపీఎం మునెయ్య, ఏఈలు నాగరాజు, విద్యావతి, సర్పంచులు వెంకటస్వామి, చిరంజీవి, కూటమి నాయకులు పాల్గొన్నారు.